# సాయి పట్ల భక్తి విశ్వాసాలే భక్తుని సిరిసంపదలు

*పూజ్య ఆచార్య శ్రీ ఎక్కిరాల భరద్వాజ*

కొందరికి పూర్వ పుణ్యము వలన ప్రయాస లేకుండానే సిరిసంపదలు, కీర్తి ప్రాప్తిస్తాయి. అలాంటి వారికి మహాత్ములతోను, భగవంతునితోను ఏమి పని? అసలు భగవంతుడు, మహాత్ములు వున్నారనే స్పృహే వారి కుండదు. అలాంటి వారిలో మహారాష్ట్రలో గొప్ప నటుడిగా కీర్తి గడించిన గణపతిరావు బోడస్ ఒకడు. అతడికి ఏ మహాత్ముల యందు గౌరవం గాని, విశ్వాసము గాని లేదు; సరికదా, అలాంటి వారిని దర్శించేవారిని పరిహసించేవాడు కూడా!

ఒకసారి గణపతిరావు బోడస్ అహ్మదునగర్ లో పనిపడి కొద్దిరోజులు అక్కడ వున్నాడు. అక్కడ శ్రీ సాయిబాబా గురించి వినిన దగ్గర నుండీ, ఆయనను దర్శించాలని అతడికి ఆకాంక్ష కలిగింది! ఆ సంకల్పమును మిత్రుడు మోరేకర్ తో చెప్పాడు. ఆ రోజుల్లో బాలక్ రాం మాన్కరు అనే బాబా భక్తుడు, కోపర్గాం మమల్తదారుగా వుండేవాడు. అందువలన మొదట వారిద్దరూ కోపర్గాం కి చేరి, రాత్రికి అక్కడ నిద్ర చేశారు. మరురోజే బోడస్ శిరిడి వెళ్ళాడు.

మొట్టమొదట బోడస్ ద్వారకామాయిలో సాయిని దర్శించుకుని, ఆయనకు ఒక కొబ్బరికాయ, ఎండుపొగాకు సమర్పించాడు. సాయి వెంటనే అతనిని ఆ పొగాకు తమ చిలిమ్ లో పెట్టి, దానిని వెలిగించి యిమ్మన్నారు. తరువాత తాపీగా దాని పొగపీలుస్తూ ఆగంతకుడిని క్లుప్తంగా క్షేమ సమాచారాలు విచారించారు. మరుక్షణమే సాయి కంఠధ్వని లోను, ముఖములోను కొద్ది మార్పు వచ్చింది. "దక్షిణ ఇవ్వు" అన్నారు విసురుగా. ఆయన వైఖరికి ఆశ్చర్యపోయిన బోడస్ ఒక రూపాయి సమర్పించాడు. దానిని తీసుకుంటూ సాయి, "భోజనం చేయకుండా వెళ్ళవద్దు సుమా!" అని, ఇంకేవో సామాన్యమైన మాటలు మాట్లాడుతూ, అకస్మాత్తుగా, కోపంతో "వెధవల్లారా, మీలో మీరు పోట్లాడుకుని చస్తారేమి? ఇంక బాబా మీకు ఏమి చేయగలడు?" అన్నారు. ఆ మాటలు ఎవరికీ అర్థం కాలేదు. ఎక్కడో భక్తులకు ఏదో సమస్య ఎదురై వుంటుందని, అందుకే బాబా అలా అన్నారని అందరూ తలచారు.

కానీ బోడస్ కు తక్షణమే కారణం అర్థమైంది! సరిగ్గా రెండు రోజుల ముందే అతడు, అతని చిరకాల స్నేహితుడైన జోగ్లేకర్ తగవులాడుకున్నారు. బాబా అంటే ఏమిటో బోడస్ కు అర్థం అయిపోయింది.

అలా మధ్యాహ్న హారతి అయ్యాక, ద్వారకామాయి వెనుక ప్రక్కనే ఉన్న ఒక ఇంటికి భోజనానికి వెళ్లాడు బోడస్. అక్కడ సాయి అతడిని దక్షిణ కోరారన్న మాట విని, ఒక భక్తుడు అతనితో, "నీవు వెంటనే నీ వద్దనున్న పైకమంతా ఆయన ముందు కుమ్మరించవలసింది. ఎంతటి అవకాశాన్ని జారవిడుచుకున్నావు!" అన్నాడు. ఆ మాట యథార్థమనిపించి, యీసారి అవకాశం రాగానే తప్పక అలానే చేస్తానన్నాడు బోడస్.

తరువాత అతడు తిరుగు ప్రయాణమై సాయి అనుమతి, ఆశీస్సులు కోరడానికి మసీదు చేరాడు. ఆ సమయంలో ఒక మంగలి సాయికి తల, గడ్డం, మీసం, క్షవరం చేస్తున్నాడు. బోడస్ ఎంతో భక్తి ప్రపత్తులతో సాయికి పాదాభివందనం చేశాడు. "అయితే వెడుతున్నావన్న మాట!" అన్నారు బాబా. ఎంతో వివేకంతో, సమయస్ఫూర్తితో, "లేదు, మీ అనుమతి కోసం వచ్చాను బాబా" అన్నాడు బోడస్.

"సరే వెళ్ళు! దక్షిణ, కుక్షణా ఏమైనా యిస్తావా?" అన్నారు బాబా – అతని వైపు చెయ్యి చాపుతూ.

బోడస్ కు కొండెక్కినంత సంతోషం వేసింది. తానెప్పుడో వస్తుందనుకున్న సదవకాశం అంత అకస్మాత్తుగా తనకు రావడంతో ఉక్కిరి బిక్కిరి అవుతూ, తన పర్సులో వున్న పైకమంతా తీసి బాబా చేతిలో వుంచాడు. బాబా ఎంతో

*మిగతా 28వ పేజీలో*

ఆధ్యాత్మిక వైజ్ఞానిక మాసపత్రిక

# సాయిబాబా

OFFICIAL ORGAN OF SRI MANGA BHARADWAJA TRUST

సంపుటి:37 అక్టోబర్-2019 సంచిక:06

పరమపూజ్య ఆచార్య శ్రీ ఎక్కిరాల భరద్వాజగారిచే స్థాపించబడిన ఏకైక పత్రిక, మన 'సాయిబాబా'

## విషయ సూచిక


| | | | |
|---|---|---|---|
| 01. | సాయి పట్ల భక్తి విశ్వాసాలే భక్తుని సిరిసంపదలు | పూజ్య ఆచార్య శ్రీ ఎక్కిరాల భరద్వాజ | 03 |
| 02. | నా సమాధి నుంచి నా కర్తవ్యాన్ని నిర్వహిస్తాను | రోహిణి | 05 |
| 03. | అవధూత శ్రీ చివటం అమ్మ | శ్రీమతి టి.శారదా వివేక్ | 07 |
| 04. | పరిప్రశ్న | పూజ్య ఆచార్య శ్రీ ఎక్కిరాల భరద్వాజ | 09 |
| 05. | వార్తాలాపము | శ్రీమతి అడిదం వేదవతి | 10 |
| 06. | సాయిని లౌకికమైన కోరికలతో దర్శించవచ్చా? | పూజ్య ఆచార్య శ్రీ ఎక్కిరాల భరద్వాజ | 13 |
| 07. | కాళీ విగ్రహంతో ఆనందమయి తాదాత్మ్యం | పూజ్య ఆచార్య శ్రీ ఎక్కిరాల భరద్వాజ | 14 |
| 08. | మాస్టర్ E.B. | శ్రీ చక్రవర్తి | 15 |
| 09. | మహర్షి | శ్రీ ఎమ్. పున్నయ్య శాస్త్రి | 17 |
| 10. | సాయి సమాధి అయిన రోజు నాకు యిప్పటికీ గుర్తే! | శ్రీ చిదంబర్ | 22 |
| 11. | అన్నాసాహెబ్ దభోల్కర్ | పూజ్య ఆచార్య శ్రీ ఎక్కిరాల భరద్వాజ | 24 |
| 12. | ద్వారకామాయి అనుభవమండపము | శ్రీ జయచంద్రారెడ్డి | 25 |
| 13. | ఆచార్యుని అద్భుత లీలలు | శ్రీమతి లలిత ; శ్రీమతి దేవి | 26 |


చిరునామా

Sri Manga Bharadwaja Trust,
Bhakta Nivas, 12-1-170/46P, Hanuman Nagar,
Jaipuri Colony, Nagole, Hyderabad - 500068
Phone No. +91 - 74160 41550

**www.saibharadwaja.org**
**www.saimasterforums.org**

చీఫ్ ఎడిటర్: శ్రీ పోలూరి శ్రీనివాసరావు బి.ఎ, ఎల్.ఎల్.బి

ఎగ్జిక్యూటివ్ ఎడిటర్: డా॥ ఆర్.ఎస్. శశిధర్, పిహెచ్. డి

చందా వివరములు

| | | |
|---|---|---|
| విడి ప్రతి | : | రూ. 10-00 |
| సంవత్సర చందా | : | రూ. 100-00 |

సాయిబాబా పత్రికలో వెలువడే వ్యాసాలకు, అభిప్రాయాలకు ఆయా రచయితలే బాధ్యులు.

# నా సమాధి నుంచి నా కర్తవ్యాన్ని నిర్వహిస్తాను

*పూజ్య ఆచార్య శ్రీ ఎక్కిరాల భరద్వాజ*

శ్రీ సాయిబాబా గురుసేవా వృత్తాంతం గురించి చదివాక మనకు కొన్ని ప్రశ్నలు ఉదయిస్తాయి.

1. శ్రీ సాయికి గురువు ప్రత్యక్షంగా ఎదుటనున్నారు గనుక వారు అలా సేవించుకోగలిగారు. మనకీనాడు సాయి అలా అందుబాటులో లేరు కదా!

2. సాయికి లౌకికమైన ఎట్టి బాధ్యతలు లేవు, కాబట్టి గురువు లభించినా, అలా నిరంతరం సేవించుకోగలిగారు. జీవితంలో బరువు బాధ్యతలు గల మనం అంతగా ఆయన సేవించడం ఎలా సాధ్యం?

కానీ ముఖ్యమైన ప్రశ్నలివి కావు. అంతటి గురువు ఈనాడు మనకు లభించినా మనలో అంతలాగా సేవించే దీక్ష, విశ్వాసాలు వుండవద్దా? సాయి భౌతికంగా శిరిడీలో జీవించిన 56 సంవత్సరాలలో ఆయనను ఎందరు అలాగ సేవించగలిగారు? అట్టివారు తమకు ఒక్కరు కూడా కనిపించలేదని సాయియే అన్నారు. వారి ప్రత్యక్ష భక్తులలో కెల్లా గొప్పవారుగా పేరుపొందిన శ్రీ ఉపాసనీ బాబా కూడా సాయి దృష్టిలో శిష్యుడు అనదగినవారు కాదు. సాయి పెట్టిన నాలుగు సంవత్సరాల గడువు పూర్తిగా ఖండోబా ఆలయంలో వుండజాలక మూడున్నర సంవత్సరాలకి శిరిడీ విడిచి వెళ్ళిపోయారు.

అందుకనే ఈనాడు బాబా తమ భౌతికరూపాన్ని సమాధిలో నిక్షిప్తం చేసి, నిత్య జాగరూకులై, చైతన్యంగా నిలచారు. భక్తితో పిలిచిన పలుకుతామని, తమ మట్టి సమాధానము చెబుతుందని, తమ సమాధి ఎప్పుడూ భక్తుల వెంటనుండి కాపాడుతుందని, తమ సమాధినుండి కూడా తాము యథాపూర్వం తమ భక్తులను కనిపెట్టి వుంటామని వారు ప్రతిజ్ఞ చేశారు. ఇది ఎందరో భక్తుల అనుభవం కూడా.

వారు అంత శక్తిమంతులు కదా, తమ భౌతిక దేహంతోనే చిరకాలం నిలిచియుండక, మహాసమాధి ఎందుకు చెందారు? - అని అడగవచ్చు. సాయి వంటి ఉత్తమాధికారులు తప్ప సమకాలీనుడైన మహాత్ముని అంత నిశ్చలమైన భక్తి శ్రద్ధలతో సామాన్యులు సేవించుకోలేరు. ఎంతటి మహాత్ముడైనా మనమధ్య భౌతికదేహంతో సంచరిస్తుంటే, క్రమంగా మనలో అశ్రద్ధ పెరిగి, వారిలోనూ మానవత్వాన్నే చూస్తాము. బాల్యము నుండి శ్రీకృష్ణుడు ఎన్ని లీలలు చూపినా, చనువుతో కూడిన మిత్రభావం వలన అర్జునుడు కేవలము సామాన్య స్నేహితుడిగా, ఒక యాదవుడిగా మాత్రమే ఆయనను తలచాడు. యుద్ధభూమిలో విశ్వరూప సందర్శనం అయినప్పుడు మాత్రమే అతడు తన పొరపాటును గుర్తించగలిగాడు. అలానే నిరంతరము సాయిలీలలను చూస్తూ కూడా, వారి పాదాలలో నుండి అనుగ్రహించబడిన గంగా, యమునా జలాలను తీర్థముగా త్రాగలేక పోయాడు దాసగణు. సర్వ తీర్థాలు, సకల దేవతలు వున్నాయని ఒక్క క్షణంలో ప్రత్యక్షంగా చూసిన అతడు యితర పుణ్యక్షేత్రాలను దర్శించాలని ఆరాటపడుతూ వుండేవాడు. నార్కే అనే భక్తునికి సాయి పిచ్చివారేమోనని సందేహం కూడా కలుగుతుండేది. బాలక్ రాం మాన్కర్ వంటి భక్తవరుడికి కూడా సాయిని ఎప్పుడూ చూస్తూండటం వల్ల వారు

దేహబద్ధులైన సామాన్య సాధకులేమోనన్న భావం అతనిని వదలలేదు. అతడిని మచ్ఛీంద్రగడ్ పంపి అక్కడ కూడా మరొక భౌతికదేహంతో దర్శన, స్పర్శన, సంభాషణలను అనుగ్రహించి అతడి భ్రాంతిని దూరం చేశారు. కొంతవరకైనా శ్రద్ధాభక్తులతో సేవించుకోగలిగిన వారిని ప్రత్యక్షంగానే సేవించుకోనిచ్చారు.

ఈవివరణకుపర్యవసానం?మనపైకరుణభావంతోనే సాయి మహాసమాధి చెంద నిశ్చయించుకున్నారు. భౌతికమైన ఎడబాటు పరోక్షత వారిపై మనకి గల ప్రేమను భక్తిని యినుమడింపజేస్తుంది. అట్టి భక్త్యంకురాన్ని వారి చరిత్ర, చరిత్ర పఠన, యిప్పటికీ ప్రకటన అవుతున్న లీలా విభూతిని మనహృదయాలలో నాటుతాయి. వాటినిపటిష్టం చేయటానికి అవసరమైనప్పుడు భక్తులు కోరకున్నా, సాయి వారికి తమ భౌతిక రూపంతో దర్శనము యిస్తూనే వున్నారు. ఇక మిగిలింది వారు సూచించిన విధానాన్ని అర్థం చేసుకొని వారిపై అచంచలమైన విశ్వాసంతో దానిని అనుసరించడమే! అది ఎలా చేయాలన్నదే మన ప్రస్తుతాంశము.

నిరంతరమూ సాయి భౌతిక రూపము వారి మధ్య వుండటం వలన ప్రత్యక్ష భక్తుల దృష్టి బాబా యొక్క విశ్వవ్యాప్తమైన, అనంత లీలావిభూతివంతమైన వారి దివ్య తత్వం మీదనుండి తొలగి, వారి పరిమిత మానవాకృతి మీద, వారి సామాన్య జీవక్రియల మీద కేంద్రీకృతమై, వారు కూడా మన వంటి మానవులు అన్న ఏమరపాటు కలిగేది. ఆ విషయంలో యిప్పటి మనం ఎంతో అదృష్టవంతులం. వారి లీలలలో ప్రకటమయ్యే సద్గురుతత్వమే వారి దివ్యచరిత్ర గ్రంథాల రూపంలో మన మనోనేత్రం ముందు ప్రత్యక్షమవుతుంది. వారి చిత్రపటం మనం ప్రత్యక్షంగా చూచి సేవించ నోచుకోని వారి భౌతిక రూపానికి ప్రతిబింబము అవ్వడం వలన మనలో అలాంటి ఏమరపాటును కలిగించదు. కనుక లభ్యమైన అంతవరకు సమగ్రమైన వారి దివ్య చరిత్ర గ్రంథాలను పారాయణ చేయటం వలన వారి పట్ల మనకు భక్తి వెల్లువలై పారుతుంది. మొదట లభ్యమైన సాయి చరిత్ర గ్రంథాలన్నింటినీ చదివి, వాటిలో మన హృదయాన్ని ఏది ఎక్కువగా ఆకర్షిస్తుందో, దానిని నిత్య పారాయణ గ్రంథంగా వుపయోగించుకోవాలి. ఎప్పుడైనా అవసరమైనప్పుడు కొత్తదనం కోసం ఇతర చరిత్ర గ్రంథాలను, యిప్పటికీ ప్రకటమవుతున్న వారి లీలలను తెలియజేసే పత్రికలను చదువుతూ వుండాలి. ఈ విధంగా సాయి యొక్క విశ్వరూపము మన హృదయంలో కొంత స్థిరపడ్డాక దానిని గురించి చింతన చేస్తూ, సాయి వారి గురువును సేవించినట్లు మనము వారి చిత్రపటానికి పూజాది సేవలు చేయడం ఆరంభించాలి. సాయి పటానికి, సాయికి భేదము లేదని తెలిపే లీలలను స్మరించి వారు ప్రత్యక్షంగా పటములో వున్నారని గుర్తించి పూజించాలి.

కొన్ని ఆవృత్తాలు చరిత్ర పారాయణ చాలినంత జరిగాక, అప్పుడు వారి సూక్తులను బోధలను వివరించి చెప్పే 'శ్రీ సాయి ప్రబోధామృతం' వంటి గ్రంథాలను విరామ సమయాల్లో చదివి మననం చేసుకోవాలి. అప్పుడు ఆయన బోధించిన సాధనా విధానము యొక్క స్వరూపము కొంతైనా అర్థమవుతుంది. అందువలన మన సాధనకు ఆటంకమును కల్పించే మన దృక్పథం మార్పుచెంది సాధన సుగమం అవుతుంది. ఆ సాధనను క్రమంగా మన నిత్యజీవితంలోని ప్రతి చిన్నపని లోనికి ఎలా వ్యాపింప చేసుకోవాలో మనకే తెలుస్తుంది

సాయి సాధనంతటికీ మూలమును మూడు అంశాలుగా చెప్పవచ్చు.

1. విశ్వములోని అన్ని రూపాలలోనూ వ్యాపించి ఒకే సాయి తత్వం నిండియున్నది' అన్న గుర్తింపు--మన ఆలోచనలు, పనులు అన్నింటికీ నేపథ్యంలో ఎప్పుడు వుండేలాగా చేసుకోవటం.

2. ఇట్టి అవగాహన సహాయముతో మనకు సాటివారి పట్ల గల రాగ, ద్వేష, అసూయాది భావాలను తొలగించుకోవడం.

3. జీవిత కర్తవ్య రూపమైన మన లౌకిక కార్యాలు అన్ని మనలోని కర్మ వాసనలను క్షయింప జేసుకోవడానికేనని గుర్తించి ఆయా కార్యాలను క్షుణ్ణంగా చేయడము. మనకు ఐహికముగాను, ఆధ్యాత్మికంగాను సాయిబాబాయే బాధ్యులని గుర్తుంచుకోవడం.

ఈ మూడు అంశాలే శ్రద్ధ, ఓరిమి. ●

# అవధూత శ్రీ చివటం అమ్మ

శ్రీమతి టి.శారదా వివేక్

(గత సంచిక తరువాయి)

"అవధూతావస్థలో ఉన్న జీవన్ముక్తులు ఎవరి దృష్టినీ ఆకర్షించక, అందరికంటే మహోన్నతమైన స్థితిలో ఉంటారు. అట్టి పరిపూర్ణమైన అవధూత శ్రీ చివటం అమ్మ" అంటూ పూజ్య శ్రీ భరద్వాజ మాస్టర్ గారిచే కొనియాడబడిన అమ్మ జీవిత చరిత్రను ఆగస్టు సంచిక నుండి ధారావాహికంగా ప్రచురిస్తున్నాము.

-ఎడిటర్

## తొలిపలుకులు

(పూజ్య ఆచార్య శ్రీ భరద్వాజ విరచితము)


(గత సంచిక తరువాయి)

సూర్యుడు, చంద్రుడు, నక్షత్రాలు ప్రకృతిలో వివిధరూపాలు ఎంతో శోభాయమానంగా మననాకట్టుకుంటాయి. ఒక్కొక్క ప్రత్యేక లక్షణంతో మన దృష్టిలో ప్రత్యేకంగా నిలుస్తాయి. కాని యివన్నీ ఏ ఆకాశంలో వున్నాయో అది వాస్తవానికి వీటన్నింటికంటే అద్భుతమైనది, మహిమాన్వితమైనది. కాని మన దృష్టినది ఎన్నడూ ఆకర్షించదు. వాస్తవానికి అదే ముందు చెప్పినవన్నీ వుండడానికవకాశం. యోగులు, సిద్ధులు, మంత్రవేత్తలు - విరివిగా మహిమలను ప్రదర్శించేవారందరూ మన దృష్టిని ఆకర్షించేవారిలాగా వుంటారు గాని, అవధూతావస్థలో నున్న జీవన్ముక్తులు ఎవరి దృష్టినీ ఆకర్షించకపోయినప్పటికీ అందరికంటే మహోన్నతమైన స్థితిలో వుంటారు. అందుకే అవధూత అన్న పేరు ప్రపంచంలో ఆధ్యాత్మికజ్ఞానాన్ని వర్ధిల్లజేసే యోగనాథుడైన దత్తాత్రేయుల వారికి వర్తిస్తుంది. ఆయన దక్షిణామూర్తి వలె యోగులకు యోగి, గురువులకు గురువు. అట్టి పరిపూర్ణమైన అవధూతే అమ్మ.

"సృష్టిలోని సర్వ వస్తువులకు ఒక తలముంటుంది. పరిధి వుంటుంది. అదే రూపం కలిగి వుండటమంటే. కాని ఆకాశానికట్టి ఆచ్ఛాదనేమీ వుండదు. అలానే పరిపూర్ణ అవధూతావస్థలో వున్న అమ్మ కూడ దిగంబరియే. నిజానికి మనకు గోచరమయ్యే ఆమె భౌతిక దేహం కూడా మనపట్ల ఆమెకుగల కరుణ వలన ఆమె ధరించిన ఆచ్ఛాదన మాత్రమే. ఒక వంక ఒకస్థాయి వరకు మన సాధనకు, భక్తికి ఆ భౌతికరూపం సహకారియే ఐనా మరొక వంక ఆ రూపమే ఆమె అని మనం పొరబడటానికి అవకాశం కూడాను. అందుకే తమ నిజతత్వాన్ని మనకు ప్రకటం చేసే మహోన్నతము, కరుణాపూర్ణము అయిన గొప్ప ఉపదేశము, బోధ - ఆమె నిర్యాణము. ఇప్పుడు చివటంలో వున్నది నిజమైన అమ్మ. సమాధి చెందక ముందున్న ఆమె రూపం అన్యమైన రూపాల నుండి మన శ్రద్ధాప్రేమలను తన వైపుకు మళ్ళించుకునే ఉపకరణము

మాత్రమే. అమ్మ సమాధి దగ్గర కూర్చున్నప్పుడు మన హృదయంలో అనుభవమయ్యే పరిశుద్ధమైన శాంతి అమ్మ యొక్క నిజ రూపము. మహనీయుల సన్నిధిలో కంటే వారి సమాధుల సన్నిధిలో ఎక్కువ శాంతి అనుభవం కావడానికి కారణమేమని అడిగిన భక్తులతో ఆమె చెప్పిన సమాధానమే ఆమె సమాధికీ వర్తిస్తుంది. భౌతిక రూపం మరుగైంది కనుక మరొక భౌతిక రూపం వైపుకు పరుగెత్తే వారంతా నిజమైన అమ్మ తత్త్వాన్ని గుర్తించనట్లే. అమ్మ భౌతికంగా వుండగా ఎలా దర్శించేవారో, సేవించేవారో అలానే ఇప్పుడు కూడా దర్శిస్తూ వుండే భక్తులే నిజమైన భక్తులు. భక్తులలాంటి పరిపాకం చెందాలన్న ఆమె ఆకాంక్ష, "ఇది నిజమైన శివమఠం కావాలే!" అని భక్తులతో ఆమె అన్న మాటలలో వ్యక్తమౌతుంది. ఆమెను దర్శించిన వారందరూ నిజమైన జ్ఞానం కోసమే, తరింపు కోసమే ఆమెను దర్శిస్తున్నామని తలుస్తారు. కాని ఇట్టి ఆచరణ వలననే వారి ముముక్షుత్వమెంత వాస్తవికమో నిరూపణ అవుతుంది. తక్కిన వారందరూ పేరుకు మాత్రమే ముముక్షువులు. అందుకే అమ్మ, "నా దగ్గరకన్నీ పచ్చికాయలే వచ్చాయే!" ఒక్క పండైనా రాలేదే!" అన్నారు. "చచ్చేదాకా వస్తుండండి" అని బోధించి మనం 'పండు' అయ్యేందుకు మార్గం చెప్పారు. నిజమైన ముముక్షువు ఈ సూచననందుకోవాలి. అంతటి పరిపూర్ణత నొందిన మహాత్ములు ఏమీ బోధించక పోయినా వారి దర్శనమే ఒక ఉపదేశమని, వారి దృష్టి, స్పర్శ, పలుకు ఎంతో గొప్ప ఆశీర్వచనాలనీ శాస్త్రం చెబుతుంది. శ్రీసాయి, శ్రీ రమణ మహర్షి నిజమైన జ్ఞాని తాను గురువనీ, యితరులు శిష్యులనీ తలచడనీ, భక్తులే తమ పూర్ణ విశ్వాసంతో అట్టి వారిని గురువులుగా స్వీకరించి సేవించాలనీ చెప్పినదానికి అర్థమిదే. కనుక అమ్మ ఏమీ బోధించ లేదనడం సరికాదు. ఆమె మౌనమే నిజమైన బోధ. నిరంతరమైన బోధ. ఆదిశంకరులు అందుకే పరబ్రహ్మను గూర్చి నిజమైన వ్యాఖ్యానం మౌనమే ననీ, అట్టి గురువు యొక్క మౌనమే శిష్యుల సంశయాలను విచ్ఛిన్నం చేయగలదనీ, దక్షిణా మూర్తి స్తోత్రంలో చెబుతారు.

సరిగా అటువంటి ఆమె నిర్గుణతత్త్వాన్ని గుర్తించేపాటి పరిపాకం లేని మనస్సుకు ఆమె సన్నిధిని గాఢంగా



స్ఫురింపజేసే వాగ్రూపమైన శిల్పమే యీ చిన్ని పుస్తకం. వెనుక అమ్మ యొక్క భౌతిక రూపం ఎలా ఉపకరించిందో అలా యికముందు మనకు ఉపయోగించగల అమ్మ యొక్క భౌతిక రూపం ఈ పుస్తకమే! దీనిని భక్తి శ్రద్ధలతో మరల మరల పఠించి అమ్మ స్మృతిని మన హృదయంలో ప్రతిష్ఠించుకోవడమే తక్కిన సాధనంతటికీ దృఢమైన పునాది. కారణం మనిషి దేనిని దీర్ఘకాలం భావిస్తాడో ఆ విషయం యొక్క గుణాలు అతని మనస్సు మీద ముద్రించుకుంటాయి. అమ్మలోని వైరాగ్యం, గురుభక్తి, సాధనలో దృఢనిష్ఠ, ఆమెలోని స్థితప్రజ్ఞత లక్షణాలను మనం భావన చేసిన కొద్దీ, మన మనస్సుకు కూడ అట్టి సంస్కారాలు బలీయమవుతాయి. అందుకు విరుద్ధమైన సంస్కారాలు నశిస్తాయి. అమ్మ మనకు ప్రసాదించాలని తాపత్రయపడిన వికాసం కలుగుతుంది. "దృఢంగా నీ గురువును విశ్వసించి అంటిపెట్టుకో, గురువే సకల దేవతలు. వేరు సాధనలు, శాస్త్రాలు అవసరంలేదు" అని శ్రీ సాయి యిందుకే అన్నారు. అందరి హృదయాల యందు అమ్మ శక్తి వర్ధిల్లు గాక!

**- సశేషం**

# పరిప్రశ్న

## పూజ్య ఆచార్య శ్రీ ఎక్కిరాల భరద్వాజ

ప్రశ్న :-పురాణ పురుషులు, మన పూర్వీకులు, సాయివంటి మహనీయులూ 'ఆటో-రైటింగ్' ద్వారా సమాధానాలిస్తారన్నది ఎంత వరకు నిజం?

- ఎ.ఎస్.ఎస్., సూళ్ళూరు పేట.

**జవాబు** : మనిషి గుప్తమైన విషయాలను (భవిష్యత్తు, నిక్షేపాలు, శాంతులు, గతజన్మలు మొ॥నవి) గురించి తెలుసుకొనే యత్నాలే యీ ఆటోరైటింగ్, శకునము, ప్రశ్న, జోతిష్యము మొ॥న ప్రక్రియలు. కానీ యివన్నీ భగవంతునికి మాత్రమే తెలుస్తాయని, ఏమిజేసినా మానవుడు వీటిని తెలుసుకోలేడని, అలాగాక భగవంతుని సర్వస్య శరణు పొందినవారిని అవసరమైన విధంగా ఆయనే నడిపిస్తాడని భక్తునికి తెలియడమవసరమని, ఆయన తలచిన వాటిని ఆయనయే ఏదో ఒకరీతిన తెల్పగలడని సర్వమత గ్రంథాలు చెప్పాయి. కనుక అలా శరణు పొందక వక్రమార్గాలలో యిలా తెలుసుకోవచ్చని నమ్మడం ఒకవంక దైవం యొక్క ప్రేమతత్వాన్ని విశ్వసించలేకపోవడము, మరొకవంక అహంకారమునకు చిహ్నమున్నూ. సర్వానికి అధిపతి మన మడుగకనే గాలి, వెలుతురూ, నీరు మొ॥వి ప్రసాదించిన పరమాత్మయొక్క యీ రహస్యాలు భక్తి కన్యమైనరీతుల తెలియజూడడం ఆయన జేబుకొట్ట చూడడమే అవుతుంది. మనను ప్రేమించిన వ్యక్తిని మనం ప్రేమించి విశ్వసించలేక, రహస్యంగా అతని డైరీలు తిరుగవేసి, గోడచాటున నక్కి అతని మాటలు విని, అతని రహస్యాలు కనుగొని లోకానికి వెల్లడి చేయడమంతటి తుచ్ఛమైనపని. కనుక సర్వమత గ్రంథాలు వీటిని హీనంగా ప్రకటించాయి. అందుకనే ఇలా తెలుసుకొనే మానవుల ప్రయత్నాలను భగవంతుడు, ప్రకృతి వమ్ముచేసి చెలగాటమాడుతారు. ఇటువంటి రీతుల గుప్తమైన విషయాలను చెప్పేవారిని నిర్మొహమాటంగా పరిశీలిస్తే వారు చెప్పే భవిష్యత్తు మొ॥న విషయాలు కొన్ని రైటైనా కొన్ని తప్పుతాయి. వాటికేదో విధంగా సమాధానాలు చెప్పుకొని వారు తమను, సాటివారిని భ్రాంతిలో కొనసాగించుకుంటారు. కొన్ని వీరు చెప్పేవి వాస్తవాలైనా కొన్ని లౌకిక విషయాలలో తప్పిపోవడంవలన వారు చెప్పిన ప్రతి విషయమూ వాస్తవమని ఋజువయ్యే దాకా సందేహాస్పదంగా వుంటుంది. కనుక ఏమి తెలియనట్లేగదా! కానీ మానవులకు ఆశ ఎక్కువ. అందుకే కొంచెమాలోచిస్తే యివి అవిశ్వసనీయమని తెలిసినా – జూదరి తన వ్యసనాన్నిలాగా – విడువలేరు. ఈ ఆటోలైటింగ్, అంతర్వాణి మొ॥న విధానాలు పూర్వజన్మ మొ॥న విషయాలు వీరు చెప్పినపుడు మనకవి సరియైనవో కాదో తెలియదు గనుక మనకేమి తెలియదన్న విశ్వాసంవలన, వారికేమో తెలిసే చెబుతున్నారని భ్రమిస్తాము. అంటే ఇటువంటి వక్రమార్గాలక్కరలేకుండా కర్తవ్యాన్ని దైవము లేక సాయివంటి మహనీయులు స్వచ్ఛము, దివ్యము అయిన మార్గంలో భక్తులకు తగిన విషయాలను తెల్పుతున్నారని "ద్వారకామాయి అనుభవ మంటపము" లోని అనుభవాలు ఋజువు చేస్తున్నాయి. ఎన్నో కష్టాలనుభవించిన పాండవులు, రాముడు మొ॥న వారెవ్వరినీ యిటువంటి తుచ్ఛ మార్గాలవలంబించమని అటు శ్రీకృష్ణుడు, వేదవ్యాసుడు, వశిష్ఠ విశ్వామిత్రాదులు ఆదేశించకపోవడమే గమనార్హం. జూదంవలెనే యీరీతులు గూడ వ్యసనాలే. ●

# వార్తాలాపము

## శ్రీమతి అడిదం వేదవతి

(గత సంచిక తరువాయి)

శ్లో॥ న మోక్షో నభసః పృష్ఠే న పాతాలే నా భూతలే।
అజ్ఞాన హృదయ గ్రన్థేర్నాశో మోక్ష ఇతి స్మృతః॥

భావము: ఆకాశములో మోక్షము లేదు. పాతాళము లోనూ లేదు. భూమి మీద కూడా మోక్షము లేదు. హృదయములోని అజ్ఞానమనే గ్రంథిని నశింపచేయడమే మోక్షమన బడుతుంది.

దుఃఖ నివృత్తి, సుఖప్రాప్తి మోక్షానికి అర్థము. అలా జీవించేవాడే జీవన్ముక్తుడు. శృతులు ఇలా చెబుతున్నాయి--

శ్లో॥ యదా సర్వే ప్రముచ్యన్తే కామాయే2స్య హృది స్థితాః
అథ మర్త్యో 2మృతో భవత్యత్ర బ్రహ్మ సమశ్నుతే

భావము: ఎవని బుద్ధిలోని కోరికలన్నీ నశిస్తాయో ఆ మానవుడు మృత్యువునకు అతీతుడౌతాడు. అతడు ఇక్కడే బ్రహ్మాన్ని పొందుతాడు.

బ్రహ్మవేత్తలకు గురుబోధ జరుగక ముందు శరీర ధారణ కోసం కలిగే అన్నపానాలు మొదలైన ప్రవృత్తులకు కారణమైన కోరికకు భిన్నాలైన ఇహపర కోరికలు నశిస్తాయి. వెంటనే (గురు)బోధ జరిగిన తర్వాత మరణాన్ని ఇంకా జయించని ముముక్షువు అవిద్య--కోరికల వలన కలుగు మృత్యువు--నశించడం వల్ల, ఇతర లోకాలకు వెళ్లడానికి కారణమైన మృత్యువు నశించడం వలన మరణ రహితుడౌతాడు. అలా ఇతర లోకాలకు వెళ్లవలసిన అవసరం లేకుండా ఈ లోకంలోనే అన్ని బంధాల నుంచి ముక్తుడై బ్రహ్మసుఖాన్ని అనుభవిస్తాడు.

వేదధర్మంలో మరణం తర్వాత మాత్రమే మోక్షం కలుగుతుందని అంగీకరించబడలేదు. శాస్త్రాలు పుణ్య పాపాలకు ఫలము స్వర్గ నరకాలు అని చెబుతున్నాయి. పుణ్యఫలాన్ని అనుభవించిన తర్వాత మానవలోకానికి తిరిగి రావాల్సిందే.

'క్షీణే పుణ్యే మర్త్యలోకం విశన్తి'

ఈ కాలంలో కొందరు స్వర్గము, నరకము బంధమోక్షాదులు సత్యము కావు. నలుగురిని వలలో వేసుకోవడానికి పన్నిన పన్నాగాలు మాత్రమే అని అంటున్నారు. కానీ అది సరికాదు.

ఇటువంటి సందేహము మన కెన్నడు కనిపించని స్వర్గము మొదలైన వాటి పట్ల ఏదో ఒక రోజున ఎవరికైనా కలుగవచ్చేమో కానీ ప్రత్యక్షంగా పొందగలిగే మోక్షము విషయములో మాత్రము కలగడానికి వీలులేదు. మోక్షము మీ శరీరంలోనే కలుగుతుంది. కాబట్టి దానిని సాధించాలి.

వేదశాస్త్రాలలో చెప్పబడిన ప్రకారము ఏకాంతంగా కూర్చుని అభ్యాసం చేసినట్లయితే ఈ విషయము ఎంతటి సత్యమో అర్థమవుతుంది. తగినంత పురుష ప్రయత్నం చేసి అనుభవించనంతవరకు అది కేవలం అభూత కల్పన అనే అనిపిస్తుంది. కాబట్టి మానవుడు నమ్మడు. సాంఖ్య సూత్రములో ఇలా చెప్పబడివుంది.

"నాన్ధ దృష్ట్యా చక్షుష్మతా మనుపలమ్భః"

భావము: ఒక గుడ్డివాడికే ఒక వస్తువు కనిపించినప్పుడు అది కళ్ళు వున్నవారికి కనిపించక మానదు.

విజ్ఞానవేత్తలు మరొక దృక్పథాన్ని కలిగి వున్నారు. విజ్ఞానంలో పరమాత్మ అనే వస్తువు లేనేలేదు. కాబట్టి పరమాత్మను ఇంద్రియాల ద్వారా సూచించడం వీరికి ఎలా సాధ్యపడుతుంది? జాతి గుణ క్రియా సంబంధాలు గల అంశాలు కలిగిన పదార్థాలే ఇంద్రియ విషయాలు. పరమాత్మ అటువంటిది కాకపోవడంవల్ల ఇంద్రియ విషయాల ద్వారా ఎలా అనుభవం కాగలదు?

పరమాత్మ బుద్ధిచేత పొందదగినది. భగవానుడు భగవద్గీతలో దానిని 'బుద్ధిగ్రాహ్యమతీన్ద్రియమ్' అని చెప్పి

వున్నాడు. బుద్ధిచేత బ్రహ్మతత్వాన్ని తెలుసుకోవచ్చు. ఇంద్రియాల ద్వారా కాదు. ఇంద్రియ విషయము కానట్టిదియు, బుద్ధిచేత మాత్రమే అనుభవించదగినది సాటిలేని బ్రహ్మ సుఖము.

'అతీంద్రియం' అంటే కళ్ళు మొదలగు ఇంద్రియాల ద్వారా కలిగిన జ్ఞానానికి సంబంధించనది. రజోగుణ, తమోగుణ రహితమైన బుద్ధి ద్వారా అనుభవించదగినది. ఈ బ్రహ్మసుఖం కేవలం బుద్ధిచేత మాత్రమే తెలియగలదు

అసంప్రజ్ఞాత సమాధిలో బుద్ధి యొక్క వృత్తి మాత్రమే లయమౌతుంది. బుద్ధి మాత్రం లయం కాదు. కాబట్టి ఆ సుఖాన్ని బుద్ధి అనుభవించగలదు. అందువలన బ్రహ్మసుఖము బుద్ధిచేత మాత్రమే తెలుస్తుంది అనడంలో ఎలాంటి సందేహం లేదు. ముండకోపనిషత్తులో బ్రహ్మ సుఖము బుద్ధిగ్రాహ్యము అనే విషయము ఇలా వివరించబడినది--

*శ్లో॥ న చక్షుషా గృహ్యతే నాపి వాచా నాన్యైర్దేవైస్తపసా కర్మణా వా।*

*జ్ఞాన ప్రసాదేన విశుద్ధ సత్త్వస్తతస్తు తం పశ్యతి నిష్కలం ధ్యాయమానః॥*

భావము: ఆ బ్రహ్మ సుఖము కళ్లకు కనిపించేది కాదు. మాట ద్వారా తెలుసుకోలేము. ఇతర ఇంద్రియాల ద్వారా కూడా దానిని గ్రహించలేము. కర్మ వలన గాని, తపస్సు వలన కూడా అది కలుగదు. జ్ఞానం పొందడం ద్వారా నిర్మలమైన అంతఃకరణాన్ని పొందిన యోగి బ్రహ్మ సాక్షాత్కారానికి అర్హుడవుతాడు. అతడే ధ్యానం చేస్తూ కళా రహితుడైన బ్రహ్మను పొందుతాడు.

బ్రహ్మానికి రూపము లేదు. కాబట్టి కన్నులు గ్రహించలేవు. జాతి గుణ క్రియల చేత కూడా దానిని తెలుసుకోలేము. అందువలన వాక్కుకు కూడా అందదు. ఇలానే ఇతర ఇంద్రియాలకు కూడా అంతు చిక్కదు. అంతేకాదు కృచ్ఛ్ర చాంద్రాయణము మొదలైన తపస్సుల వలన గాని, అగ్నిహోత్రము మొదలైన కర్మల ఫలితంగా కూడా అది లభించదు. ఎందుకంటే అది ఆత్మ స్వరూపము. మట్టి నుండి కుండ పుట్టినట్లు అది దేని నుంచి పుట్టినది కాదు. మూల పదార్థమునుండి ఉత్పత్తి చేయబడినది ఏదైనా అశాశ్వతమే కదా! ఆత్మ స్వరూపము అశాశ్వతమైనది కాదే! పెరుగు పాల యొక్క వికారం అయినట్లు, ఆత్మస్వరూపము మరో వస్తువు యొక్క వికారము కాదు. మోక్షము బ్రహ్మస్వరూపము. బ్రహ్మానికి మరొక స్థితి లేదు. ఒక గ్రామానికి ప్రయాణం చేసే వాడికి ఆ గ్రామం చేరడంతోనే గమ్యం చేరినట్లే. కానీ మోక్షము అలా లభించేదికాదు. బ్రహ్మ సర్వవ్యాపకమైనది కాబట్టి అందరికీ అన్ని చోట్ల ఎల్లప్పుడూ పొందవచ్చు. మోక్షమనేది సంస్కార్యము కూడా కాదు. సంస్కారం రెండు విధాలు

గుణా ధాన సంస్కారము
దోషాపనయన సంస్కారము

పండ్ల చెట్లకు ఎరువు వేసి మంచి పంటలను పొందుతాము. ఇది గుణాధాన సంస్కారము. మురికిగల అద్దంలో ప్రతిబింబము కనిపించదు. తుడిచివేసిన తరువాత ప్రతిబింబము కనిపిస్తుంది. ఇది దోషాపనయన సంస్కారము. ఈ రెండు సంస్కారములు బ్రహ్మమందు జరగవు. కాబట్టి అది కర్మ వలన లభించదు. నిర్మలము, ప్రశాంతము అయిన బుద్ధికి మాత్రమే బ్రహ్మానుభూతి కలుగుతుంది. ధ్యానము బ్రహ్మానుభవానికి పరంపరాగతమైన కారణము. సమాధి సాక్షాత్కారణము. బ్రహ్మానుభవము అంటే బ్రహ్మానందము బుద్ధిచేత మాత్రమే తెలియబడేది.

"మనసైవాను ద్రష్టవ్యమ్" మొదలగు శృతులు కూడా బ్రహ్మ తత్వమును బుద్ధిచేత మాత్రమే తెలుసుకోవచ్చని చెబుతున్నాయి. మనసు ద్వారా అంటే బుద్ధి ద్వారా బ్రహ్మ తత్వాన్ని తెలుసుకోవాలని దాని అర్థము. ఇలా భగవద్గీత మొదలైన స్మృతులు, శృతులు కూడా బ్రహ్మతత్వము బుద్ధి వలన తెలుసుకోదగినదని నిర్ధారణ చేస్తున్నాయి.

కానీ తైత్తిరీయోపనిషత్తు లో ఇలా చెప్పబడి వున్నది:-

'యతో వాచో నివర్తన్తే అప్రాప్య మనసా సహ'

వాక్కు, మనస్సు కూడా ఆ బ్రహ్మాన్ని విషయంగా చేసుకోలేక వెనుకకు మరలిపోతాయి అని దాని అర్థము. దీనిని బట్టి బ్రహ్మ మనస్సుకు విషయము కాదు అనేది స్పష్టము. అందువలన బుద్ధిగ్రాహ్యం అనేది ఈ వాక్యానికి విరుద్ధమైనది. అంతేకాదు యుక్తి కి కూడా ఇది విరుద్ధమే.

అంతఃకరణము బ్రహ్మము విషయంలో జడమైనది. జడమైన దానికి చైతన్యము విషయము కాదు. కాబట్టి బ్రహ్మము బుద్ధిచేత గ్రహింపబడుతుందని చెబితే దానికి వ్యాఘాత దోషము కలుగుతుంది. ఆ దోషము పట్టకుండా వుండటానికి అంతకరణ ద్వారా ఆత్మజ్ఞానము ఆత్మకే కలుగుతుందని

చెబితే ఆత్మాశ్రయ దోషము పడుతుంది. అద్దములో తన ముఖమును తానే చూసుకున్నట్లుగా అంతఃకరణము ద్వారా ఆత్మ ఆత్మను చూస్తుంది అని చెప్పవచ్చు. అక్కడ బింబము ప్రతిబింబాన్ని చూస్తుంది.

బింబము బింబాన్ని చూడలేదు. కాబట్టి అంతఃకరణము ద్వారా ఆత్మజ్ఞానము ఆత్మకు కలగదు. ఆత్మ, అంతఃకరణము ఒకదానిని ఒకటి తెలుసుకోగలవని భావిస్తే 'అన్యోన్యాశ్రయము' అనే దోషం కలుగుతుంది. ఈ దోషాన్ని పరిహరించడానికి ఆత్మ అంతఃకరణాల మధ్య 'చిదాభాసము' అనే మూడోదాన్ని అంగీకరిస్తే 'చక్రక దోషము' పడుతుంది. చిదాభాసము తన అస్తిత్వానికి అంతఃకరణాన్ని అపేక్షిస్తుంది. అంతఃకరణము స్వాధిష్టానమైన కూటస్థుని అపేక్షిస్తుంది. కూటస్థుడు తన ప్రకాశానికి చిదాభాసాన్ని అపేక్షిస్తాడు. ఇలా చిదాభాసము అంతఃకరణమును, అంతఃకరణము కూటస్థుని, కూటస్థుడు చిదాభాసాన్ని అపేక్షించడంలో చక్రక దోషము కలుగుతుంది. దీనిని నివారించడానికి ప్రయత్నిస్తే 'అనవస్థా దోషము' పడుతుంది. కాబట్టి 'బుద్ధిగ్రాహ్యమ్' అనేది యుక్తికి విరుద్ధమైనది. ఇందుకు సమాధానము ఇది--

ఆవరణ భంగ రూపమైన వృత్తికి మాత్రమే బ్రహ్మము విషయము. చిదాభాసరూపమైన ఫలానికి బ్రహ్మము విషయము కాదు. బ్రహ్మ మనోగోచరము అని చెప్పిన సందర్భాలలో అంటే 'మనసైవాను ద్రష్టవ్యమ్', 'బుద్ధిగ్రాహ్యమతీంద్రియమ్'మొదలైన సందర్భాలలో కేవలము వృత్తిని మాత్రమే గ్రహించాలి. బ్రహ్మము మనోగోచరము కాదు అని చెప్పిన సందర్భాలలో అంటే 'యతో వాచో నివర్తన్తే అప్రాప్య మనసా సహ' మొదలైన సందర్భాలలో చిదాభాసరూపమైన ఫలము నిషేధింపబడినట్లు తెలుసుకోవాలి. ఇలా ఏర్పాటు చేయడంలో శ్రుతి, స్మృతులకు ఒకే భావము అర్థమై మన యుక్తిలో కలిగే సందిగ్ధము తొలగిపోతుంది. బ్రహ్మజ్ఞానానికి బుద్ధే ఏకైక సాధనమని శృతులలోనే స్పష్టం చేయబడింది.

*'దృశ్యతే త్వగ్ర్యయా బుద్ధ్యా సూక్ష్మయా సూక్ష్మదర్శిభిః|'*

భావము: సూక్ష్మ దర్శనము (సూక్ష్మ దృష్టి) కలవారి చేత సూక్ష్మబుద్ధి ద్వారా అంటే ఏకాగ్రత కలిగిన బుద్ధిచేత ఆ బ్రహ్మము చూడబడుతుంది.

ఈ శృతిని ప్రమాణంగా తీసుకుని అతద్వ్యావృత్తి చేత అంతఃకరణము ద్వారా అనుభవం కలుగుతుంది. అతద్వ్యావృత్తి అంటే అన్ని ఉపాధులను ఆలంబన లను నిషేధించి ఆత్మానుభవాన్ని పొందడము అతద్వ్యావృత్తి అంటే ఏమిటో ఈ కింది దృష్టాంతము ద్వారా అర్థం అవుతుంది.

శ్రీరాముడు దండకారణ్యం వెళ్ళినప్పుడు ఋషులు వాళ్ల భార్యలు ఆయన చుట్టూ చేరారు. రామలక్ష్మణులు ఇద్దరు పురుషులతో, సీత వారి భార్యలతో కలిసి ఆశ్రమానికి వచ్చారు. అక్కడ మగవారంతా ఒకవైపు, వారికి ఎదురుగా ఆడవారు కూర్చున్నారు. రామలక్ష్మణులు నారబట్టలు ధరించి ఉండడం వల్ల ఋషులలో కలిసిపోయారు. అప్పుడు ఒక ఋషి స్త్రీ అక్కడికి వచ్చింది. ఆమెకు రాముడిని చూడాలనే కోరిక కలిగింది. ఆమె వెర్రిగా ఋషి భార్యల సమూహంలోని సీతను చూసి, "రాముడు ఎక్కడ?" అని అడిగింది. సీత కుల స్త్రీ కనుక సమాధానం చెప్పలేదు. అప్పుడు ఒక వృద్ధురాలు "అలా అడగకూడదు సుమా!" అని ఆ ఋషి స్త్రీని మందలించింది. కానీ ఆమె కొంతమంది పురుషులను వేలుతో చూపిస్తూ ఇతడు రాముడా, ఇతడు రాముడా, అని తిరిగి తిరిగి సీతను అడిగింది. కాదు, కాదు అని సమాధానం చెప్పింది సీత. అప్పుడు ఆమె లక్ష్మణుని వేలితో చూపించి "ఆ తెల్లని వాడు రాముడా?" అని సీతను ప్రశ్నించింది. "కాదు అతడు నా మరిది" అని సీత జవాబు చెప్పింది. మరల ఆమె "అతని ప్రక్కన కూర్చుని ఉన్న ఘన శ్యాముడు రాముడా?" అని అడిగింది. సీత సిగ్గు పడింది. అప్పుడు ఆ ఋషి భార్యకు అతడే రాముడని అర్థమైంది.

ఇలా ఈ అతద్వ్యావృత్తి లక్షణములలో గ్రాహ్యమైన (గ్రహింపబడిన లేదా తెలుసుకోబడిన) సాక్షి స్వరూపమైన ఆత్మ గురించి శృతి ఇలా స్పష్టం చేస్తున్నది--

*'స ఏష నేతి నేత్యాత్మా2 గృహ్యో న హి గృహ్యతే|'*

భావము: నేతి నేతి అనే పద్ధతిలో ఉపాధుల అన్నింటిని నిషేధించడం ద్వారా చివరకు తేలేది ప్రత్యగాత్మ. అది కార్యధర్మానికి పరమైనది (అతీతమైనది) కనుక ఇంద్రియ విషయం కాదు. అంటే ఇంద్రియాల ద్వారా గ్రహించబడదు (ఇంద్రియాల ద్వారా దానిని తెలుసుకోలేము).

కాబట్టి నాస్తికవాదము చేయకుండా, వేదాల పట్ల, బ్రహ్మజ్ఞానుల బోధల పట్ల శ్రద్ధ నుంచి, అభ్యాసం చేసి, వారిలాగా ఆచరణ కలిగి వున్నవాడికి తప్పకుండా బ్రహ్మానుభవం కలుగుతుంది.

**- సశేషం**

# సాయిని లౌకికమైన కోరికలతో దర్శించవచ్చా?

*పూజ్య ఆచార్య శ్రీ ఎక్కిరాల భరద్వాజ*

బ్రహ్మణ్యం ధర్మ తత్వజ్ఞం భక్త కీర్తి వివర్ధనం
ఆపదుద్ధరణం వందే స్మర్తృగామీ సమావతు

శ్రీ సాయిబాబాను హేమాద్పంతు (అసలు పేరు అన్నా సాహెబ్ దభోల్కర్) అను భక్తుడు వారి దివ్యచరిత్రను వ్రాయడానికి అనుమతి కోరినపుడు, ఆ సద్గురుమూర్తి అతనిని ఆశీర్వదించి, తమ లీలలను శ్రద్ధగా పారాయణ చేసి, వాటిని గూర్చి మననం చేసిన వారికి అమూల్యమైన జ్ఞానధనం లభించగలదని హామీ యిచ్చారు. అంటే శ్రీ సాయీశుడు దివ్య లీలలను ప్రకటించటం కేవలము భక్తులను లౌకికమైన యిక్కట్ల నుండి రక్షించడం మాత్రమే కాదన్నమాట. పరిపాకము లేని మానవులు మొదట ఆయన నుండి కోరేది అదే కావచ్చు గాక. చక్కెర తీపికి వ్యామోహపడిన పిల్లవాడికి తల్లి చక్కెరతో కలిపి అతడికి ఆరోగ్యాన్నిచ్చే మందును తినిపించినట్లు, శ్రీ సాయి తమ లీలలతో గంభీరము, అద్భుతము, ఆధ్యాత్మికము అయిన బోధను కలిపి అందిస్తారన్నమాట. అందుకే ఒకసారి తన వివేకానికి గర్విస్తున్న ఒక భక్తుడు సాటివారికి "శ్రీ సాయిని లౌకికమైన కోరికలతో దర్శించరాదు" అని బోధిస్తుంటే, సాయి అతడితో "నీవు అలా చెప్పవద్దు. నా వద్దకు వచ్చే వారంతా మొదట అలానే వస్తారు. వారి కోరికలు తీరాక, కృతజ్ఞతతో, ప్రేమతో నాకు బంధింపబడతారు. అటు తర్వాత కోరికలను వీడి, నన్ను ఆత్మోన్నతికి కోసమే అనుసరించడం నేర్చుకుంటారు" అనీ, "ఎవరూ నా వద్దకు వారంతట వారుగా రారు. నేనే వారిని అనేక మిషల మీద దగ్గరకు లాక్కోవలసి వుంటుంది" అనీ అన్నారు. ఈ రెండవ వాక్యంలో యిమిడివున్న మందలింపును గుర్తించాలి. అలా 'వివేకాన్ని' బోధిస్తున్న భక్తుడు కూడా మొదట అలానే తమనాశ్రయించాడన్న హెచ్చరిక బాబా చేశారు.

భక్తులకు లౌకికమైన సహకారాన్ని అందించడమే సాయిలీలల సారాంశం కాదని గుర్తించాలి. మొదట చక్కెరపై వ్యామోహంతో మాత్రమే మందును తెలియకుండా స్వీకరించే బాలుడే ఒకనాటికి బాధ్యతాయుతమైన యోచన గల పురుషుడై, చక్కెరను కోరకనే అవసరమైన ఔషధాన్ని కోరి స్వీకరించేవాడు అవుతాడు. ఆనాడు వాడు నేరుగా స్వీకరించగల ఔషధము శ్రీ సాయిలీలల మాటున దాగియున్న వారి అపారమైన బోధ. "శిరిడీలో ఉన్న ఐదున్నర అడుగుల ఈ శరీరమే సాయి అని తలచేవాడు అసలు సాయిని చూడనట్లే" అన్నారు సాయి. అలానే వారి లీలలను స్థూలంగా మాత్రమే గుర్తించి, చదివి, పులకించే భక్తులు వారి చరిత్రను పారాయణ చేయనివారి క్రిందే లెక్క. అంతకుమించి తాముద్దేశించిన ప్రయోజనాన్ని సాయియే కొంత సూచించారు. కోరికలు యీడేర్చారన్న కృతజ్ఞత, ప్రేమ వలన మానవుడు భక్తిమార్గంలోకి తనకు తెలియకనే లాగబడతాడు. ఈ లీలల ద్వారా సాయి బోధించిన ఆధ్యాత్మిక రహస్యాలకు అంతులేదు! ●

# కాళీ విగ్రహంతో ఆనందమయి తాదాత్మ్యం

*పూజ్య ఆచార్య శ్రీ ఎక్కిరాల భరద్వాజ*

*(గత సంచిక తరువాయి)*

***'ఏది నిజం?' ఆచార్య ఎక్కిరాల భరద్వాజగారి సత్య సాగరమథనంలో ఆవిర్భవించిన ప్రథమ అమృత గుళిక. 'ఏది నిజం?', 'మతం ఎందుకు?' (నిజానికి నిచ్చెనలు) 'విజ్ఞాన వీచికలు' మొ॥ గ్రంథాల వరుసలో యిది మొదటిది.' - ఎడిటర్***

పదార్థంలో చైతన్యము వున్నట్లు నిరూపించే అనుభవాలను ప్రస్తావిస్తాను

శ్రీ ఆనందమయి మాత ప్రఖ్యాత దైవ స్వరూపిణి. ఆమెకు ఉత్తర హిందూస్థానంలో ఎక్కువ ప్రతీతి. బెంగాల్ లో జన్మించారు. ఆమెకు బాల్యం నుండి ఏమి చదవకనే, తనకై తానే ఎన్నో అనుభవాలను పొందడమేకాక, చాలామందికి ప్రసాదించారు కూడా. ఆమె భక్తులలో ప్రథముడు 'భాయిజీ' అన్న కలం పేరుతో వ్రాసిన 'Mother as Revealed to Me' అన్న ఆంగ్లగ్రంథములో అనేక అనుభవాలను పొందుపరచారు. ఒకసారి కాళీపూజార్థం ఒక పెద్ద మట్టివిగ్రహాన్ని చేయించి యథారీతిని పూజ చేశారు. తొమ్మిదవ రోజున ఆ విగ్రహాన్ని నీటిలో కలపడం ఆచారం. కానీ ఒక భక్తురాలికి ఆ విగ్రహాన్ని నీటిలో కలపడం ఇష్టం లేదని చెప్పగా, ఆనందమయి మాత దానిని అట్లానే వుంచి పూజలు చేయించే ఏర్పాటు చేశారు. ఒక రోజు తన భర్తతో, భాయిజీతో మాట్లాడుతుండగా అకస్మాత్తుగా ఆనందమయి తన ఎడమచేతిని పైకెత్తి చూపుతూ 'తన మణికట్టు విరిగిపోయింది' అన్నారు. అలా అనేకసార్లు అన్నారు. చూచేవారికి ఆ చేయి మామూలుగానే వుండటాన ఏమీ అర్థం కాలేదు. వారి భావం అడిగితే నవ్వి ఊరుకుని "మీకే తెలుస్తుందిలే" అన్నారు. తరువాత తెలిసింది... అదే రోజు ఆ ఆలయంలో దొంగలుపడి నగలు దొంగిలించడంలో ఆ మట్టివిగ్రహానికి ఎడమ మణికట్టును విరిచారని!

ఈ సంఘటనలో అసంపూర్తిగా ఉన్న విషయం సంపూర్ణం కావాలంటే చెప్పక విడిచిన మరొక విషయం చెప్పాలి. ఆ విగ్రహానికి ఆనందమయి పూజ చేసిన సమయంలో ఆమెకు 'అతీంద్రియావస్థ' లేక 'భావసమాధి' ఎంత సంపూర్ణంగా కలిగిందంటే, పూజలో తనకు ఆ విగ్రహానికి భేదం మరచి విగ్రహం మీద వేయవలసిన ఆ పువ్వులను తనమీద వేసుకున్నారట! ఆ సమయంలో ఆమె ముఖంలో ఒక దివ్యమైన వర్చస్సు అందరికీ సుస్పష్టమైనదట. అట్లా పూజలో ఆనందమయిలో ఉన్న చైతన్యం ఆమె ధ్యాననిష్ఠ చేత ఆ విగ్రహంలో నిద్రాణంగా ఉన్న చైతన్యంతో తాదాత్మ్యం, సంపర్కమూ చెంది తిరిగి ఆమె మనసు మానవ స్థాయికి దిగినా కూడా ఆ విగ్రహంలోని చైతన్యంతో తాదాత్మ్యాన్ని కోల్పోలేదు.

ఈ అద్భుత సంఘటన విగ్రహారాధనవల్ల ఆమెలో కలిగిన మనోదౌర్బల్యం గాను, భక్తులోని మూఢత్వం వల్ల వారు ఆ దౌర్బల్యములో లేనిపోని దైవత్వాన్ని ఊహించారని అనుకునే వారి కోసం మరొక సంఘటన.

శ్రీ హజరత్ తాజుద్దీన్ ఔలియా నాగపూర్ లో 1920 వరకు నివసించిన సిద్ధ పురుషుడు. ఆయన లీలలు, శక్తులు అద్భుతాలు. విగ్రహారాధనను విశ్వసించని ఇస్లాం మతంలో జన్మించిన ఆ మహనీయుడు నిర్యాణము చెందిన సమయములో, అక్కడి పాండురంగని ఆలయంలో విఠలుని, రుక్మిణీదేవి విగ్రహాలు 12 గంటలు సంతతధారగా కన్నీరు కార్చిన ఉదంతం 'టైమ్స్ ఆఫ్ ఇండియా' అను పత్రికలో

**- సశేషం**

# మాస్టర్ E.B.

*శ్రీ చక్రవర్తి*

మానవ సమాజము చైతన్యవంతమైనది. మానవుడికి వున్న ఈ చైతన్యం కారణంగా ప్రకృతి నుండి లభించే జ్ఞానాన్ని, తృప్తి-ఆనందాలను పొందడానికి ప్రయత్నం చేస్తున్నాడు. ఈ ప్రయత్నమే జీవితపు విలువలుగా సమాజము ముందుకు పోవడానికి ప్రయత్నిస్తూన్నది.

ఈ విలువల ఔన్నత్యాన్ని తెలియజెప్పడానికి, వీటిని పొందటానికి ఏవి ఆచరణయోగ్యమైన సూత్రాలో, ఏవికావో సశాస్త్రీయంగా తెలియజెప్పడానికి, వివరించడానికి మహాత్ములు ఎప్పుడూ ప్రయత్నం చేస్తూనే వున్నారు. క్రీస్తు, మహమ్మదు, బుద్ధుడు, వివేకానందుడు ఈ స్థాయికి చెందినవారు.

ఈ సృష్టిలో ఒక భాగమైన మానవుడు; తనకూ, ఈ సృష్టికి లక్ష్యమేమిటైవుండవచ్చునా అని జీవితంలో ఏదో ఒక రోజు అనుకోని క్షణం వుండదు. ఈ ఆలోచన కారణంగా జరుగుతున్న విజ్ఞానశాస్త్ర ప్రగతితో, జీవితాన్ని గురించిన దృక్పథాలు అనేకమైపోయి, సంఘర్షణకు లోనవుతున్న నేటి ప్రపంచానికి ఈ దృక్పథాలను సమన్వయపరచి ఆచరణ యోగ్యమైన మార్గదర్శక సూత్రాలను అందించగల మానవమూర్తి ఈ రోజు ప్రపంచానికి యెంతైనా అవసరము. అట్టివారు ఆచార్య శ్రీ ఎక్కిరాల భరద్వాజ గారు.

దేవుడంటూ ఒకడున్నాడా? లేడా? అనే జిజ్ఞాసతో ప్రారంభమైన వీరి పరిశోధన, ఆధునిక శాస్త్రాలైన భౌతిక, రసాయనిక, జీవాది శాస్త్రాల ద్వారా సాగి, సర్వగతము, ప్రాథమికము అయిన చైతన్యశక్తియే యీ సృష్టికి ఆధారమై వుండాలన్న వీరి ఆలోచనలు శిరిడీ సాయినాథుని దర్శనంతో ధృవపడినవి. భగవంతుడంటే ఏవో కిరీటాలు, అంగరఖాలు వేసుకొని నాలుగేసి లేదా ఆరేసి చేతులతో వుండే రూపాలు మాత్రమే కాదని, ఈ సకల చరాచర విశ్వమంతా ఆ చైతన్యశక్తి నిండి వున్నదని సాయినాథుడు వీరికి అనుభవ పూర్వకమైన జ్ఞానాన్ని ప్రసాదించడం విశేషం. వీరి మనస్సులో పదిలమైన ఈ జ్ఞానమే వీరి వ్యక్తిత్వాన్ని నిర్మలము, ఉదాత్తము, క్రియాశీలకమైనదిగా తీర్చిదిద్దింది.

శ్రీ సాయినాథుడు వీరికి ప్రసాదించిన అనుభవపూర్వకమైన యీ జ్ఞానమే--

'శ్రీ సాయి లీలామృతం' గా
'శ్రీసాయి ప్రబోధామృతము' గా
'ఏది నిజం' గా
'విజ్ఞాన వీచికలు' గా
'మతం ఎందుకు' గా
'మహాత్ముల చరిత్రలు' గా మన ముందున్నది.

వీరి పరిచయం పొందిన విద్యార్థులు, మేధావులు సైతం ఈ విషయాలను గుర్తించి వీరి బోధనలను, కార్యక్రమాలను అనుసరిస్తున్న విషయము అందరికీ తెలిసినదే.

మానవుడు వ్యక్తిగతంగాను, సామాజికంగాను పురోగమించడానికి మూడు అంశాలు అన్ని రంగాలలో పనిచేస్తున్నవి. వీటిలో మొదటిది, అతిముఖ్యమైనది 'ఆచరణ'. ఇది లేకుండా దేనినైనా సాధించడం అసంభవం. రెండవది జీవితానికి విశ్వ వ్యాపకము, మౌలికము, శాశ్వతము అయిన విలువలతో గల 'లక్ష్యము'. ఈ లక్ష్యమే ఆచరణకు కావలసిన స్ఫూర్తినిస్తుంది. ఇక మూడవది ఈ లక్ష్యాన్ని సాధించడానికి ఆచరణ

యోగ్యమైన 'మార్గదర్శక సూత్రాలు'.

లక్ష్యము: ఈ మూడు అంశాలలో లక్ష్యము అన్ని జీవిత రంగాలను సమన్వయ పరిచేదిగా వుండాలి.

మార్గదర్శక సూత్రాలు: మానవ సమాజంలో గల విభిన్న దృక్పథాలను సమన్వయ పరిచేవిగా అన్ని జీవిత రంగాలను, విభిన్న దృక్పథాలను, పరిపూర్ణం చేయగల మార్గదర్శక సూత్రాలను అందరూ ఆచరించినప్పుడు సమాజములో సుఖము, శాంతి వుంటుంది. అలాగాక దృక్పథాలు, ఆచరణ సూత్రాలు భేదించినప్పుడు, లేక బేధించినట్లుగా వ్యక్తులు అర్ధం చేసుకున్నంతసేపు బేధాభిప్రాయాలు వుంటూ సంఘర్షణకు దారి తీస్తుంది.

ఆచరణ: ఇక ముఖ్యమైన విషయం ఆచరణ. సమాజంలో ఎక్కువ మంది దేనిని ఆచరిస్తారో, దేనిని భావిస్తుంటారో, మిగతావారు కూడా ఆ దారినే వెడుతుంటారు. అంటే మంచి ఆలోచనలు, మంచి నడవడి గల సమాజంలో మంచి వాతావరణం వుంటుంది. ఆ వాతావరణం జీవితాన్ని సుఖమయం చేస్తుంది. అలాకాక దీనికి వ్యతిరేకమైన వాతావరణం వున్నప్పుడు సమాజము అశాంతి, అరాచకంతో నడుస్తుంది. ఈ స్థితికి కారణం సమాజంలోని వ్యక్తుల మార్గదర్శక సూత్రాలు భేదించడం వల్లనే కాక ఆచరణ లోపించటం ప్రధానాంశం.

ఈ దృక్పథాలను, యీ మార్గదర్శక సూత్రాలను సమన్వయపరుస్తూ ఆచరణ తట్టు స్ఫూర్తినివ్వగల సాంప్రదాయం ఏదైనా ఈనాటి ప్రపంచానికి అత్యవసరము. ఇట్టి సాంప్రదాయాన్ని మానవాళికి అందించిన మహనీయుడు శిరిడి సాయినాథుడు. ఇట్టి ధర్మాన్ని నేటి ప్రపంచానికి అందించగల మహనీయుడు మన శ్రీ భరద్వాజ గారు.

సృష్టికి మూలము, ఆధారము అయినది చైతన్యశక్తి. మానవునితో సహా అన్ని జీవజాతులలో స్వయంచోదితమై ఏ సూత్రాలకు లోబడని లేక పరిమితంగాని ఒక జీవశక్తి వుంటున్నది. ప్రకృతి రూపాలను గూర్చి ఎరుక పొందటంగాని, వాటికి సంబంధించిన జ్ఞానాన్ని పొందడానికిగాని ఈ జీవశక్తి కారణము. జీవి అనుభవించి ప్రకటించే ప్రేమ-ద్వేషం, స్వార్థం-త్యాగం, సహనం-కోపం, దయ-ద్వేషం లాంటి విరుద్ధ భావాలకు కారణం ఈ జీవశక్తి. ఈ జీవశక్తినే చైతన్యశక్తి అంటారు. ఇది జీవిలో పరిమితంగావుండి తాను సృష్టిరూపాల కంటే భిన్నమని తలుస్తుంది. అలాగాక ఈ వ్యష్టిచైతన్యము విస్తృతమై విశ్వవ్యాపకమైనప్పుడు విశ్వచైతన్యంతో తాదాత్మ్యం పొంది అన్ని రూపాలలో తాను వున్నట్లు అనుభవం పొందుతుంది. అంతేకాక ఆ స్థాయిలో అన్ని అనుభవాలు తానే అయి భాసిస్తాడు.

ఇలా అన్ని రూపాల చైతన్యంతో తాదాత్మ్యం పొంది ఒకేసారి వ్యక్తిగత చైతన్యస్థాయిలోనూ, విశ్వ చైతన్యస్థాయిలోనూ వుండగల వ్యక్తిత్వం శిరిడి సాయినాథునిది. ఈ కారణంగా అన్ని జీవులు తామేనని, ఎవరు ఏ జీవిని హింసించినా, పోషించినా అది తమకే చెందినట్లు అనుభవపూర్వకంగా నిరూపించారు శ్రీ సాయినాథుడు. అంతేగాక అందరూ మహనీయులు, దేవతలు తమ రూపాలేనని భక్తులకు అనుభవపూర్వకంగా నిరూపించారు. ఈ నిరూపణలతో అన్ని రూపాలలో కనపడే సాయి రూపం కారణంగా ఈ సృష్టిరూపాలను ఎలా ద్వేషించగలము? ఈ నిరూపణ ప్రతి మానవునిలో సహజంగా చోటుచేసుకునివున్న ద్వేషం-అసూయలను తొలగించి ఆ స్థానములో ప్రేమ-త్యాగాలను స్థిర పరుస్తుంది. ఈ మార్పే వ్యక్తిలో ఆధ్యాత్మికోన్నతికి అవసరమైన సత్వగుణాన్ని ప్రేరేపించి విశ్వాత్మ స్థాయికి చేరుస్తుంది. ఈ ప్రకృతిలో మానవుడు ఏ తృప్తి,శాంతి కొరకు తపిస్తున్నాడో; వాటిని అఖండంగా ఆ స్థాయిలో అనుభవిస్తాడు.

శ్రీ భరద్వాజ మాస్టరుగారు నేటి ప్రపంచానికి అందిస్తున్న ఈ శిరిడీ సాయితత్త్వం సమాజ నిర్వహణకు అవసరమైన జీవశక్తి, సర్వజీవులపైన అవ్యాజమైన ప్రేమ, కరుణ, క్రియాత్మకమైన త్యాగాలే అన్ని మతాలలో నిర్వచించబడ్డ ఆచరణ సూత్రాల సారాంశం. అన్ని సాంఘిక ధర్మాలకు మూలము వీటి ఆచరణే. అదే సాయితత్త్వం

నేటి వ్యక్తిగత మానవ జీవితము ప్రపంచ ఉద్యమాలతో పూర్తిగా ముడిపడివున్నది. కానీ సృష్టికి మానవ సమాజానికి విలువైన లక్ష్యము చైతన్యవికాసమేనని; అందుకు ప్రేమ, త్యాగాలే ఆచరణ సూత్రాలని ఈ ధర్మం అనుగుణంగా మానవ సమాజాన్ని పునర్నిర్మించాల్సిన అవసరం వుందని గుర్తింపజేసే మాస్టర్ గారి ప్రచార కార్యక్రమాన్ని అంతర్జాతీయ స్థాయికి పెంచడం ఎంత అవసరమో

***మిగతా 28వ పేజీలో***

# మహర్షి

శ్రీ ఎమ్. పున్నయ్య శాస్త్రి

*(గత సంచిక తరువాయి)*

***(తెలుగు లెక్చరర్ గా చేస్తూ స్వచ్ఛంద పదవీ విరమణ చేసి ఆధ్యాత్మిక బాటలో పయనిస్తున్న వీరు చిన్నప్పటినుంచి తమ గురువుగారైన శ్రీమాన్ ఎక్కిరాల కృష్ణమాచార్యుల గారింట వున్న కారణంగా భరద్వాజ మాస్టరుగారిని చిన్ననాటి నుండి ఎరిగిన వ్యక్తిగా తమ జ్ఞాపకాలను మనకందిస్తున్నారు.)***

శ్రీ భరద్వాజ రచనలన్నింటినీ స్వీకరించి చదివి తరించాలని కోరిక కలిగిందోసారి. అయితే మొత్తాన్ని ఒకేసారి కొనాలని. కానీ సరిపోను డబ్బుల్లేవు. వాయిదా వేస్తే, మనస్సు చలింపవచ్చును. అందుకని వారినే వేడుకున్నాను. మూడు వాయిదాలలో తీరుస్తాను, రచనలన్నింటినీ ప్రసాదింపుడని. తన 'అన్నగారి అంతేవాసినని, తన బాల్య మిత్రుడనని ప్రేమతో శ్రీభరద్వాజ తన రచనలను యావత్తు నాకు బహుమతిగా యివ్వాలనివుంది' అన్నారు. మా ఇద్దరి చిరకాల పురాతన మైత్రి అది. నేను బాలుడను, ఆయన యువకుడు అవుతుండగా స్నేహమయ్యింది. నేను వారి శిష్యుడను కాకపోవచ్చును. చనువుతో 'నీవు' అని ఏకవచనంతో సంభోదించేవాణ్ణి. ఆయన అలాగే నన్ను పిలిచేవారు. పాఠకులు అభ్యంతర పడనక్కర్లేదనుకుంటాను. అంతరంగంలో మాత్రం నాకు వారి యెడల గురుభావం వుందని గ్రహింపగలరు కదా. అయితే వారి ఔదార్యాన్ని సున్నితంగా ఇలా తిరస్కరించాను. "మీ అన్నగారి వద్ద పెరిగాననే వాత్సల్యంతోనే నీకూ, నాకూ మైత్రి కుదిరింది. ఆయన గారి వద్దనే వారి రచనలేవీ నేను వెల చెల్లించకుండా పుచ్చుకొనలేదు. ఒక్క 'గోదావైభవం' తప్ప వారు బహూకరింపలేదు. దగ్గరగా తిరుగుతున్న వారే ఊరికే పుచ్చుకుంటే ఎలా? నీ ప్రేమను దుర్వినియోగ పరచలేను. ఆర్థికంగా ఇచ్చే స్థితి వుందికదా! నీ ఆశీస్సులే నాకు బాబా ఆశీస్సులు. నేను నీలానే అవ్వాలనే ఆశీస్సులు చాలు. నాకు వెలకే ఇవ్వు". భరద్వాజ గారు సమ్మతించారు. అన్నింటి పైన లేఖనంగా సాయి ఆశీస్సులను అనుగ్రహించారు. అయితే వారు నన్ను ఒక ప్రశ్న అడిగారు "మా అన్నగారు నీకు గోదావైభవమనే తన కావ్యాన్ని ఒక్క దానిని బహూకరించారన్నావు. దానిపై వారు ఏమి వ్రాశారు?" నేను చెప్పాను "ఆత్మ స్వరూపుడవైన మల్లాది పున్నయ్యకు" అని. శ్రీభరద్వాజ వెంటనే, ఎంతో ఆనందోత్సాహాలతో ఇలా స్పందించారు, "ఇందులో రెండు పాయింట్లు ఉన్నాయి. నీకు అలాంటి సంభోదనతో ఆశీస్సులిచ్చినది సాక్షాత్తు నీ గురువే. అది నీ భాగ్యం. తనంత కావాలనే కదా. పైగా ఇచ్చిన గురువెట్టివాడు? మా అన్నగారిలాంటి మహాత్ముడు. ఇంక నీకంటూ కావాల్సిందేమీ లేదు. ఎన్ని జన్మలకైనా నీక్కాల్సిందే నీ గురువు ఇచ్చారు". నాలో గురుభక్తి, అనన్య శరణాగతిని ఉజ్వలంగా ప్రదీప్తం చేశారు శ్రీభరద్వాజ. అంతే కాదు. తనకు అన్నగారిపై గల భక్తి గౌరవాలను ప్రకటించారు. ఇప్పుడొక విచిత్రం జరిగింది. అన్నగారి ఆశీస్సులకు తమ్ముడుగారు భాష్యం చెప్పారు. ఆ చెప్పడంలో తనలోంచి సాయినాథుని ఆశీస్సులు అందాయి. ఇదే భావించాను. మా అన్నగారిస్తే చాలు సాయినాథుడిచ్చినట్లే అని శ్రీభరద్వాజ సమాధానము. ఇంతలో మా పెద్దమ్మాయి వచ్చింది. ఆమెనూ

దీవించారు. "మీ పిల్లల గూర్చి ఎట్టి బెంగా పడవద్దు. ఏది కావాలో అదే ఇచ్చిన నీ గురువు ఇలాంటివన్నీ చూడగలడని తెలుసుకో. నీవు ఆయన్ని స్మరించి అనుసరించడంలో మాత్రం వెనుదిరగకు సుమా". ఇదీ వారి బాధ.

ఇంకో ముఖ్యాంశాన్ని ఇచ్చట ప్రస్తావించవలసి వున్నది. ఇది శ్రీభరద్వాజ గారి లోకజ్ఞతకు, ఋషిత్వానికి, మార్గదర్శన నైపుణ్యానికి మచ్చు తునక. అన్నగారి పుత్రులకు, ముఖ్యంగా పెద్ద కుమారుడైన అనంతకృష్ణగారికి అన్నగారు పరమపదించిన తర్వాత ఆపదలు రాబోతున్నాయని గ్రహించి, వారికి కొంత మార్గదర్శనం చేశారు. ఇంకా వారు నాకు, తన అన్నగారి కుమారులకు ఇచ్చిన అమూల్యమగు ఉపదేశాలు కొన్ని యిచ్చట ప్రస్తావించుటకు వీలుకానివి. శ్రీభరద్వాజ ముందే చెప్పిన అక్షరాలు వాస్తవరూపం ధరించాయి. శ్రీభరద్వాజ కొన్ని సందర్భాలలో నాతో మాట్లాడినప్పుడు నేను విభ్రాంతికి లోనుకావాల్సి వచ్చింది. పరమ నిష్కల్మషుడు, సాయినాథుని సర్వంతర్యామిత్వంలో నిరంతరం ఓలలాడే భక్తుడు, జీవితమంతా ఆయనకే అర్పించి అహోరాత్రులు కృషి సల్పిన తపస్వి, సుఖదుఃఖాలను సమంగా స్వీకరించిన మేరుధీరుడు శ్రీ భరద్వాజ. ఈయన దగ్గర గమ్మత్తుంది. తండ్రిగారినైతేనేం, తన తల్లిగారినైతేనేం (నా వద్ద ఆమెను స్మరిస్తూ వుండేవారు) అన్నగార్లను వారి కుటుంబాలను తన కుటుంబాన్ని, తన అనుచరులను అందరినీ ప్రేమించారు. కాని ఎక్కడా మమత్వానికి గాని వ్యామోహానికిగాని లొంగలేదు. తన భార్య అనారోగ్యవతి. అయినా దుఃఖ పడలేదు. కృంగిపోలేదు. అన్నగారి కుటుంబము ఆపదల్లో వుందని తాను దీనుడు కాలేదు. వారి క్షేమానికై తాను సాయి కృపను అర్థించారు. భక్తుడైన వాడికి మామూలుగా లోకజ్ఞత ఉండదు. కాని శ్రీ భరద్వాజకు అందరూ సాయి స్వరూపులే. అలాగే ఆవశ్యకతమైతే ఎవరెలాంటి స్వభావముతో, ఎప్పుడు ఎలా ప్రవరిస్తారో దానికి తగినట్లుగా తాను ఎలా ప్రవర్తించాలో, సాయిబాబా తనకు లోలోన ఉపదేశవాణి వినిపించేవారు. ఇలాంటి కొన్ని ఉదాహరణలను నాకు ఎరిగింపబడ్డాయి. వానినుటంకించటం, పొడిగింపు భీతి వల్ల మానివేస్తున్నాను,

శ్రీ భరద్వాజ నాకు యిచ్చిన సాయి పుస్తకాలన్నీ పఠించాను. ముఖ్యంగా సాయి లీలామృతం, శ్రీ గురు చరిత్ర , సాయి సన్నిధి ఎన్నోమార్లు పారాయణం చేశాను. ముఖ్యంగా సాయి లీలామృతం, సాయి సన్నిధి ఒక విధంగా పరిశోధనా గ్రంథములు. వీనిని వ్రాయడం వెనుక శ్రీ భరద్వాజ చేసిన కృషిని గూర్చి వారినే ప్రశ్నించాను. వారు ఇలా అన్నారు "సాయి బాబాను గూర్చి వీలయినంత సమగ్రంగా తెలిసికోవాలనే ఆపేక్షతో నేను 12 సం||రాలు మహారాష్ట్ర దేశంలో పర్యటించాను. చాలా ప్రాంతాలు కాలినడకన పర్యటించాను. ఎందరో సాయి భక్తులను కలిసి ప్రత్యక్షంగా వారెరిగిన వాస్తవాల్ని వారినుండి సేకరించాను. బాబాకు ప్రత్యక్ష శిష్యులను కలుసుకొని వారు చెప్పేవి వింటూవుంటే నాకు బాబా ప్రత్యక్ష్యసాన్నిధ్యం లభిస్తుండేది". అపుడు నేను అన్నాను, "కాలినడకన ఇంత కాలము ఇంత సువిశాల ప్రాంతము పర్యటించడంలో నీవెంత కష్టపడ్డావో. ఇది ఒక మహా తపస్సు. నీ ఈ పర్యటనలో ఒక సన్నివేశాన్ని మచ్చుగా వినిపించితే సంతోషిస్తాను." శ్రీ భరద్వాజ ఒక విచిత్ర సంఘటనను గురించి ఇలా చెప్పారు. ఒళ్ళు గగుర్పొడిపించేది అది. "ఓసారి ఓమారుమూల గ్రామంలో బాబాగారి ప్రత్యక్ష శిష్యుడు, భక్తుడు అయిన ఒక వృద్ధుడున్నాడనీ విని, వారిని కలవడానికి రెండు రోజులు నడిచి, వారింటికి వెళ్ళాను. తాళం ప్రత్యక్ష్యమైంది. ప్రక్కవాళ్ళనడిగితే, రెండు రోజులకిగానీ రారని చెప్పారు. నేనలాగే వెనుదిరగకుండా వాళ్ళు వచ్చిందాకా వారింటి వాకిటినే వుండిపోయాను. ఆ రెండు రోజులు భోజనం లేదు. ఎవరినీ అడగలేదు. ఆ ముసలాయన వచ్చిన తర్వాత నీవెవరన్నారు. నేను వివరించాను, నేను వచ్చిన లక్ష్యము. ఆయన తీవ్రమైన పరుషజాలంతో కసిరి కొట్టాడు. "ఆ సాయిబాబా ఎవరో నాకసలు తెలియనే తెలియదు. నీవిక్కడనుండి లేచిపో" అన్నాడు. "అలా కాదు, మీరు నిజంగా బాబా భక్తులే. మీరు నాకు వారిని గూర్చి చెప్పి అనుగ్రహించేదాకా నేను కదలనే కదలను" అన్నాను. బూతులు తిట్టాడు. నేను సహించాను. చివరకు కర్ర తీసికొని కొట్టడానికి సిద్ధమయ్యాడు. దానికి నేను సంసిద్ధుడనయ్యాను. అపుడు ఆయన కర్ర పారేసి, నా పై దయ చూపారు. "రా నాయనా! నీ

కోసమే ఎదురు చూస్తున్నాను. రాత్రే బాబా కలలోకి వచ్చి, నా ఆంతరంగిక భక్తుడొకడు తెలుగువాడు వస్తాడు. నీవు అతనికి నన్ను గూర్చి కావలసినదంతా చెప్పు" అన్నారు. ఆ ముసలాయన నన్ను లోనికి తీసికొని వెళ్ళి రెండున్నర రోజులు తన యింట ఆతిథ్యమిచ్చాడు. ఇంటి నిండా ఎటు చూచినా, సాయిబాబా పటాలే. ఎనలేని ప్రేమ చూపి, నన్ను గూర్చి బాబాకి ప్రియమైన బిడ్డవని అన్నారు. ఎన్నో సంగతులు చెప్పారు." ఈ వృత్తాంతము వింటున్న నాకు రోమాంచితమై, పులకితగాత్రుడనై బాబా సన్నిధిలో ఉండి పోయాను.

ఓసారి శ్రీభరద్వాజ నన్ను ఒంగోలులో వాళ్ళ సాయి మందిరానికి తీసికొని వచ్చి క్రొత్త మందిరం కట్టుబాటును చూపించారు. సంభాషణ ఫేక్ గురువుల మీదకి మళ్ళింది. "సిద్ధ పురుషులయిన వారే సద్గురుత్వము వహించడానికి అర్హులు. మనకు సద్గురువు లభించాలని మనలో తపన ఉండి, భగవంతుడినాశ్రయిస్తే, సమయం వచ్చినప్పుడు భగవంతుడే సద్గురువును మన వద్దకు పంపిస్తాడు. కొందరు పూర్ణ పురుషులు కాకుండానే, తామే గురువులమని చాటుతుంటారు. తానే ఉద్ధరణ పొందని వాడు ఇతరులనెట్లు ఉద్ధరింపగలడు? కావున అట్టి వారిని ఆశ్రయించరాదు" అన్నారు. నేనన్నాను "కొందరు మరీ షిర్డీ సాయిబాబా లాంటి సిద్ధుల ఫోటోలు పెట్టుకొని, వారిని గూర్చి చెప్తూ ఉన్నారు కదా". దానికి శ్రీభరద్వాజ ఇలా అన్నారు, "ఇట్టి వారిలో కొందరికి బాగానే భక్తి ఉంటుంది. మరి కొందరు అలా బాబా బొమ్మ పెట్టకపోతే జనం రారని అలా చేస్తారు. కాని తమను తాము గురువులమని, చాటుకుంటూ, కొన్నాళ్ళకు మేము బాబాతో సమానులమని చెప్పుకోవడానికి వెనుకాడరు. వీరు తమకు హాని చేసుకుంటూ లోకానికి హాని చేస్తుంటారు. ఇట్టి వారికి నా పద్ధతి నచ్చకపోగా, నేను తమ కీర్తికి అడ్డువస్తున్నానని అనుకోవడం కూడా జరుగుతోంది. అట్టి వారికి నేను స్పష్టంగా చెప్పాను. తమ క్షేమానికి, లోక క్షేమానికి చెప్పానే కానీ, మీకు అడ్డురావటం నా అభిమతం కాదని".

ఇక చివర్లో ముగించేముందు ఒక సన్నివేశము చెప్తాను. 1989 సెలవుల్లో నా స్వగ్రామం గురజాల వెళ్ళాను. ఇంటర్మీడియట్ స్పాట్ వాల్యుయేషన్ ఒంగోలులో వచ్చింది. ఒంట్లో ఏం బాగలేదు. చాలా నీరసంగా ఉంది. గురుదేవులను ప్రార్థించాను కర్తవ్యం కొఱకై. ఒంగోలు తప్పక వెళ్ళు అన్నారు. అలాగే ఇందిర గారింట్లో ఉంటూ వాల్యుయేషన్ వర్కుకు హాజరయ్యాను. ఓ వారం కాగానే ఏదో అవాంతరం వచ్చింది. మధ్యలో ఇంటికి వెనుదిరిగి పోవల్సి వచ్చింది. వెళ్ళే ముందు శ్రీభరద్వాజతో కాసేపు గడుపుదామని అన్పించింది. ఇందిర సహాయంతో రాత్రి 7:45 వేళ కలిసాను వారి స్వగృహంలో. ఆ రోజు అదేమిటో! అంతటి కరుణ నాపై!! రాత్రి 10:45 దాకా మాట్లాడుకున్నాము ఇద్దరం. ఎక్కువగానే సంభాషించారు. అదే వారితో చివరి కలయిక అని నాకేం తెలుసు?

చాలాసేపు ఆధ్యాత్మిక సాధనకు సంబంధించిన విషయాలు, కొన్ని విచిత్ర పరిస్థితుల్లో ఎలా ప్రవర్తించాలో చెప్పారు. 'మనల్ని ఎదుట కొనియాడుతూ, వెనుక తెగనాడేవారు వుంటారని తెలుసుకో' అన్నారు. అంతేకాదు ఒక్కొక్కసారి ఒక మహాత్ముని చుట్టూ చేరిన అనుచర బృందంలో కలియుగధర్మాన్ని బట్టి ఎలా రాకూడని భావాలు, ఘర్షణలు వస్తాయో, అవి వచ్చినప్పుడు ఒక్కొక్కసారి ఆ మహనీయులు కూడా కాలానికి విడిచి పెట్టి, ఏం చేయలేని స్థితికి రావటం ఎలా జరుగుతుందో నాకు వివరించారు. ఇవే విషయాలను కొన్ని వారి అన్నగారు కొన్ని రచనలలో ప్రస్తావించారు. ఇందులో వక్త యొక్క ఆత్మీయత కలదు. వివరాలు ఇపుడు వ్యక్తము చేయదగినవి కావు. నేను అన్నాను "మీ ఇద్దరు సోదరుల వంటి మహాత్ముల చుట్టూ కూడా అలాంటి సన్నివేశాలు తప్పవన్నమాట". శ్రీభరద్వాజ చెప్పారు "తప్పదు. ఇది మహనీయులకు చెందినది కాదు. కలియుగ ధర్మం". అయితే వారి మాటల్లో ఒక నిర్లిప్తత గోచరించింది. నిస్సంగంగా భాషించారే తప్ప, అంటుకొనలేదు. భార్య, పిల్లల విషయంలోనే సామాన్యులం వ్యామోహంలో చిక్కుకుంటాం. ఆయన తన అశేష అనుచరగణమునకు సంబంధించి కూడా, వ్యామోహంలో చిక్కుకొనలేదు. చాలా గంభీర ముద్ర దాల్చారు ఇవి చెప్తూ. ఒక విధంగా తాను భూమిపై నరదేహంతో వుండవలసినపని లేదని వారి మాటల్లో వెల్లడవుతోంది ధ్వనిగా. అయితే నా చిన్నబుర్రకు అప్పుడు తట్టలేదు.

వారన్నారు, "మహాత్ముల ద్వారా దిగివచ్చే ప్రణాళిక మాత్రం ఆగదు. దానికి తమ వ్యక్తిగత జీవితాన్ని సమర్పించుకొన్న అనుచరుల ద్వారా అది కొనసాగుతూనే వుంటుంది. నీకింకో సంగతి చెప్తాను. నీవు జాగ్రత్తగా ఉండు, సాధన తీవ్రంగా చేస్తూ, ఒక సిద్ధ పురుషుని ఆశ్రయించి, పైకి వెళ్తున్న కొద్దీ మనచుట్టూ చాలా మంది చేరతారు, అందరూ నిజాయితీ గల ఆధ్యాత్మిక సాధకులే కాకపోవచ్చు. కొందరు తమకు నచ్చినంత సేపు మనతో నిలిచియుండి, ఆ వెనుక నిందించడం, దుష్ప్రచారం చేయటం చేస్తారు. మనల్ని కీర్తించే వాళ్ళని, వీళ్ళని కూడా సమానంగానే చూడాలి. అంతే కాదు, ఎప్పుడూ మనకు ఋజుత్వంతో కూడిన సహకారమే లభ్యమవుతుందని ఆశింపరాదు. కలి ప్రేరితులైన రకరకాల వారి ప్రవర్తనను కూడ సమదృష్టితో తట్టుకోవటం నేర్చుకోవాలి". నేనన్నాను, "ఇవి మీ అనుభవంలోని అంశాలా ?", శ్రీభరద్వాజ "నీకూ! మన అనంతకృష్ణకు కూడా పనికి వస్తాయి, ఈ గుణ పాఠాలు " అని అన్నారు...

ఆయన ఉపదేశం గంటన్నర పైగా అనేకాంశముల పైకి దొర్లింది. అది నాకు చరమోపదేశమా? పరమోపదేశమా? నాచెవుల్లో ఇప్పటికీ ఆ ఋషి కంఠధ్వని గింగిర్లు తిరుగుతూనే ఉంది. ఓరకమైన గాంభీర్యం, మాధుర్యం, మార్దవం, సౌకుమార్యం కలిగిన ఒక విచిత్రమైన పలుకుబడి వారిది. అటు తన తల్లిగారి మార్దవం పుణికి పుచ్చుకున్నారు. తండ్రిగారి దీక్షా గాంభీర్యాలు స్వీకరించారు.

నేను ఒక రకమైన ధ్యాన స్థితిలో గొనిపోబడ్డాను. ఉన్నట్టుండి నాకో భావం కలిగింది. అదే వారితో అన్నాను. "నేనూ, అనంతకృష్ణ, మీ అన్నగారి కుటుంబం, ఇంకా కొందరం భక్తులం షిర్డీ పూర్వం వెళ్ళాము. ఇలాకాక ఈసారి మేమిర్వురం నీ వెంబడే షిర్డీ రావాలని ఉంది. తీసికొని వెళ్ళు." అప్పుడు శ్రీ భరద్వాజ అన్నారు. "నేనెప్పుడు షిర్డీ వెళ్తానో, నాకే ముందుగా తెలీదు. ఏంచెప్పను మీకు?". నేను అన్నాను, "అప్పటికప్పుడు అనుకున్నా సరే అనంతకృష్ణకు ఫోన్లో చెప్పు, వెంటనే సిద్ధమయి మేమిద్దరం వస్తాం". కాని శ్రీ భరద్వాజ మౌనముద్ర దాల్చారు. దీని భావమేమిటో వారు తర్వాత మూడు రోజులకు పరమపదించగా తెలిసింది. నాతో మాట్లాడుతూ అలా సిగరెట్లు కాలుస్తూనే వున్నారాయన. నేనది సహింప లేకపోయాను. ఎందుకంటే ఇటువంటి దృఢ దీక్షా బద్ధుడైన సాయిభక్తుడు లోకానికెంతో అవసరము. పైగా అతనితో వ్యక్తిగత అనుబంధం మెదలగా అతనితో అన్నాను. "ఈ సిగరెట్లు వల్ల నీ ఆరోగ్యం దెబ్బతింటుంది కదా! మానేయరాదూ!" ఆయన "మానేయడం మంచిదే. కుదరడం లేదు." అన్నారు.(ఇక్కడ మనం గమనించ వలసిన విషయం ఒకటి వున్నది. జితేంద్రులయిన మాస్టరుగారికి సిగరెట్లు మానడం అసాధ్యమా? అయితే ఆయన శిరాల స్వామిని మొదటిసారిగా దర్శించినపుడు, ఆయనకు సిగరెట్లను ప్రసాదించడమే కాకుండా, ఆ తర్వాత కూడా ఆయన సశరీరులుగా వున్నంత వరకు సిగరెట్లు మాస్టరుగారికి పంపించేవారు. అందులోని అంతరార్థం ఏమిటో వారికే తెలియాలి. అంతేగాక మహాత్ముల చరిత్రలలో కూడా వారు పొగ పీల్చడం గమనార్హం -- సంకలన కర్త) వారి యందున్న చనువుతో ఇలా అన్నానే తప్ప వారికి సలహాలు చెప్పేంత గొప్పవాడినని మాత్రం కాదు. వారి చరణ కమలాలకు నమస్కరించి వెనుదిరిగాను.

నేను కొంత ప్రస్తావించటం మరచాను. శ్రీ భరద్వాజ చివర్లో అన్నగారి లాగానే హోమియో వైద్యం చదివి, సేవ చేయాలనే తలంపుతో శ్రద్ధగా ఆ గ్రంథాలను అధ్యయనం చేసారు. నాతో కొన్నిమార్లు ఆ వైద్యం గూర్చి ప్రస్తావించారు. అంతే కాదు. చాలా మంది వారి శిష్యులకు తెలిసియుంటుంది. చివర్లో సాయిబాబా ఆదేశం పై 'భారత స్వాతంత్రోద్యమ చరిత్ర' ను గూర్చిన వాస్తవాలను పరిగణనలోనికి తీసికొంటూ ఒక పుస్తకం వ్రాయాలనిపించింది వారికి. బ్రిటీషు చరిత్రకారులచే మనదేశ చరిత్ర కొంత వక్రీకరింపబడ్డది. బ్రిటీషు మానసపుత్రులైన కొందరు భారతీయ చరిత్రవేత్తలు ఆ ఒరవడిని అట్లే కొనసాగించారు. స్వాతంత్ర్యోద్యమ చరిత్రకు సంబంధించి కూడా, ఎందరో త్యాగమూర్తుల చరిత్రలు వెలుగులోకి రాలేదు. పైగా నాయకుల జీవితాలే కాక మధ్యమశ్రేణి కార్యకర్తలెందరో బలి అయిన వారి చరిత్రలు అసలు వెలుగుచూడలేదు. ప్రశస్తిలోకి వచ్చినవారి కథల్లో కూడా ముఖ్యసన్నివేశాలు వెలుగులోకి రాలేదు. అంతేకాక అసలయిన ఋజుత్వం, మన దేశానికి పనికి వచ్చే స్థిరమయిన సైద్ధాంతిక పునాది కలవారికి ప్రాముఖ్యం తగ్గి,

ఆంగ్లేయుల అడుగులకు మడుగులొత్తే వంచకులయిన నాయకులకు ప్రాధాన్యం హెచ్చింది. దాని పరిణామమే వర్తమానం. కావున అసలయిన చరిత్ర, సమగ్రంగా భారతదేశ స్వరాజ్యమును, భారత ధర్మ ప్రతిష్ఠాపనను జమిలిగా దృష్టిలో పెట్టుకొని రాయాలి. ఇదీ భరద్వాజ గారి లక్ష్యము. కొన్ని యేండ్లు పట్టే ప్రాజెక్టు అది. దృఢ దీక్షా కంకణధారియై, పరిశోధన చేస్తూ ఆయన ఎన్నో గ్రంథాలు బాగా ప్రాచుర్యంలోకి రాకుండా దాగినవి చదవటం మొదలు పెట్టారు. నాతో ఈ సంగతి ముచ్చటిస్తూ ఏవయినా అలాంటి రిఫరెన్స్ కు పనికి వచ్చే గ్రంథాలు చెప్పమన్నారు. నేను నాకు తోచినవి, చదివినవి చెప్పాను.

నేను వారి పరమపద ప్రాప్తికి మూడు రోజుల ముందే కలిసాను. అది నా భాగ్యమే. పూజ్యులు. వదిన గారి కందజేయమని నందదీప్ సావనీర్ నాకిచ్చారు శ్రీభరద్వాజ. నాకూ ఒక కాపీ ఇచ్చారు. కారంపూడిలో వైద్య సేవలో వుండగా మిత్రులు నాకు నిదానంగా చెప్పారు భరద్వాజ గారికి ఒంట్లో బాగలేదని. పరమపదించారని చెప్తే నేను తట్టుకోలేనని. మర్నాడు ఉదయానికి గాని నాకు నిజం తెలియలేదు. వదినగారికిచ్చిన పుస్తకమంద జేయక మునుపే, వదినగారే ఒంగోలు, వెళ్ళవలసి వచ్చింది. అన్నగారి కుటుంబసభ్యులంతా ఒంగోలు వెళ్ళారు. నేనూ, పెద్దమ్మాయి, అల్లుడూ విశాఖపట్నంలో వారి యింట్లో ఉన్నాము. భరద్వాజగారు వెళ్ళిపోయిన రెండో రోజే కల వచ్చింది. కలలో వారు కన్పడ్డారు. హరిత వస్త్రధారియై నేలకు నింగికీ నడుమ ఉన్నారు. ఎందరో భక్తులు వారిచుట్టూ ఉన్నారు. నేను కన్నీరు నిండిన కనులతో వేడుకున్నాను. “నీవు కూడా వెళ్ళిపోతే, మా గతి ఏం కానూ! మార్గదర్శనం చేయించేవారు కావాలి. పైగా! నిన్ను చూస్తూ, నీతో కలిసి సంభాషించే సన్నివేశం నాకు కావాలి ”. శ్రీభరద్వాజ అన్నారు “ఏం దిగులు పడకు. నేను నీకు కన్పడుతూనే ఉంటాను. నీ వెంటనే ఉంటాను. మరలా కలుద్దాం.” చాలా తృప్తిగా ఉంది స్వప్నమయి పోయేపాటికి.

ఆ నెలరోజులు వారికెంతో ఇష్టమైన శ్రీగురుచరిత్ర పారాయణం చేశాను. నిద్రలో ఓ రోజు కల వచ్చింది. పంచనదీ సంగమం, అచ్చట ఔదుంబర వృక్షం, శ్రీ నృసింహ సరస్వతీ గురుల పాదుకాస్థలి దర్శనమిచ్చాయి. చాలా ఆనందం కల్గింది. శ్రీభరద్వాజ నన్ను ఓ విధంగా ఇలా షిర్డీ తీసికొని వెళ్ళాడనే ఆనందించాను.

శ్రీభరద్వాజ అతి తీక్ష్ణమైన మేధావి. ప్రజ్ఞాశాలి. మేధతో, తార్కిక ప్రజ్ఞతో జిజ్ఞాసగా బయలుదేరింది అతని జీవిత ప్రయాణం. అసలే లోపల ‘లోతయిన గుండె! హృదయ వికాసమూ పెరిగింది సాయి సన్నిధిలో. (A good composition of sharp head and noble heart) శ్రీభరద్వాజ తత్త్వానికి సరిపోయే శ్లోకం ఒకటి భవభూతి విరచితం కలదు.

“వజ్రాదపి కఠో రాణి, మృదూని కుసుమాదపి
లోకోత్తరాణాం చేతాంసి, కోనువిజ్ఞాతుమర్హతి ”

వజ్రం కంటే దృఢమూ, పూవు కంటే మృదులమూ అయిన లోకోత్తరుడయిన అతని చేతస్సు ఎవరు గ్రహించగలరు? అతని కన్నులలో ఒక్కోసారి భారత స్వరాజ్యోద్యమపు తొలి రోజుల్లోని ఒక విప్లవ వీరుడు కన్పిస్తాడు. ఒక్కోసారి ప్రాచీన వేదకాలపు తపస్వి కన్పిస్తాడు. శ్రీభరద్వాజ ఒక మిస్టిక్. పై శ్లోకం వారి తండ్రిగారు శ్రీమాన్ ఎక్కిరాల అనంతాచార్యుల వారికీ, వారి అన్నగారు శ్రీమాన్ కృష్ణమాచార్యుల వారికీ వర్తిస్తుంది. విచిత్రంగా తండ్రిగారు 1979లో పరమపదించారు. 5 ఏండ్లకు అనగా 1984లో వీరి అన్నగారు, 1989లో వీరు పరమపదించారు. ఇందులో పారమార్థకమయిన సూచిక ఏమిటో? ఏమయినా ఆంధ్రదేశము పైబడి ఉర్రూతలూపిన ఆధ్యాత్మికమయిన ఉప్పెన వీరి జీవనం. దానికి నిలుపుదల లేదు. కొనసాగుతూనే ఉంటుంది. శ్రీభరద్వాజ గారికి రెండు కోరికలుండేవి.

1. సాయిబాబా గారు నిర్దేశించిన సమగ్ర చారిత్రాత్మక పుస్తక రచన.

2. అన్నగారి అనుచర బృందం, తన అనుచర బృందం కలసి ఒకటిగా పనిచేయాలని. నాకు స్వయంగా చెప్పినవి. ఏలనో ఈ రెండూ ఇప్పటికీ నెరవేరలేదు. నెరవేరవని కాదు.

నా ఈ రచన పూజ్యురాలయిన పిన్నిగారికి (భరద్వాజ గారి జీవిత భాగస్వామి) అంకితం! ●

# సాయి సమాధి అయిన రోజు నాకు యిప్పటికీ గుర్తే!

చిదంబర్, అహ్మద్ నగర్

అహ్మదునగర్ కు చెందిన చిదంబర్ శిరిడీలో సాయిని ప్రత్యక్షంగా చూసిన భాగ్యశాలి. ఈయన సాయి సంస్థానంలోని పనిచేశారు. తన చిన్ననాటి స్మృతులను ఆయన ఇలా చెప్పారు:

నేను ఆగస్టు 22, 1914 లో శిరిడీలోనే జన్మించాను. మా పూర్వీకులు ఏనాడో శిరిడీలో స్థిరపడ్డారు. నా నాలుగవ సంవత్సరంలో శ్రీ సాయి మహాసమాధి చెందారు. నేను బాల్యంలో కూడా మసీదులోప్రతిరోజు గంటలు,గంటలు కూర్చునేవాడిని. ఆయనను 'బాబా' అని పిలిచేవాడిని. నా వయస్సుకు తగ్గ కబుర్లు ఎన్నో చెప్పేవాడిని. అప్పట్లో ఆయన మా బంధువు కాబోలు అన్నట్లుగా ప్రవర్తించే వారు. అయితే ఆ బంధుత్వము ఏమిటో తెలిసేదికాదు. నేను కూడా తెలుసుకోవడానికి ప్రయత్నించేవాడిని కాదు.

సాయిబాబా మహాసమాధి అయిన రోజు నాకు ఇప్పటికీ గుర్తే. అంతిమయాత్రగా ఆయన దేహాన్ని భక్తులంతా ఊరేగించారు. ఊరేగింపు మసీదు నుండి బయలుదేరి అప్పుడే నిర్మాణం పూర్తయిన సమాధి మందిరం ప్రక్కగా వెళ్ళింది. ఆ రోజులలో అందరూ ఈ మందిరాన్ని బాబా ఆలయం అనేవాళ్ళు.

క్రమంగా నా హృదయములో బాబా పట్ల నా తల్లి మీద వుండేలాంటి ప్రేమ ఏర్పడింది. నేనెప్పుడు ఇంట్లో కనిపించక పోయినా మా అమ్మ మసీదుకొచ్చి చూస్తే నేను అక్కడే వుండేవాడిని. బాబా కూడా ఎంతో ప్రేమగా నా స్థాయికి తగిన కబుర్లు నాతో చెప్పేవారు. ఎంతో సరదాగా ఆడించేవారు.

ఒక రోజు సాయంత్రం నేను బాబా ప్రక్కనే కూర్చొని వున్నాను. అప్పుడు మా అమ్మ నాకోసం వచ్చింది. ఆమె రమ్మన్న సమయానికి నేను ఇంటికి రాలేదని, తర్వాత ఎన్ని కబుర్లు చేసినా కూడా వెళ్లలేదని ఆమెకెంతో కోపం వచ్చింది. కనుక ఆమె వెంటనే నా జబ్బ పట్టుకుని బలవంతంగా లేవదీసి ఇంటికి లాక్కుపోతోంది. మసీదు ప్రహరీ దాటి బయటకు వచ్చామో లేదో ఆమె విసుగుతో నన్ను తిట్టి, వీపు మీద నాలుగు దెబ్బలు వేసింది. నేను పెద్దగా ఏడ్చాను. నా ఏడుపు విన్నారు కాబోలు బాబా మమ్మల్ని వెనక్కు పిలిపించి మా అమ్మతో ఏదో చెప్పారు. ఆయన మాటలన్నీ స్పష్టంగా అర్థమవుతున్నా, ఆయన భావమేమో అప్పుడు నాకు స్పష్టంగా అర్థం కాలేదు.

తర్వాత నా 12వ ఏట ఆయన చెప్పిన విషయం నాకు అర్థమయింది. నా ముఖం మీద కుడివైపుకు పెద్ద వాపు కనిపించింది. ఆ సమయంలో బొంబాయి నుండి వచ్చిన ఒక వైద్యుడు శిరిడీలో వున్నారు. చికిత్సకు లొంగని ఒక వ్యాధినుండి సాయికృపతో విముక్తులవడానికి ఆ డాక్టరు కొంతకాలం శిరిడీలో వున్నారు. ఎందుకోగాని ఆయనకు నా మీద అపారమైన మక్కువ ఏర్పడింది. ప్రతిరోజు సాయంత్రం ఆయన నడకకు వెళ్లేటప్పుడు నన్ను కూడా తీసుకువెళుతుండేవాడు. నాకు ముఖంమీద వచ్చిన వ్రణం గురించి ఆయనను అడగమని మా అమ్మ చెప్పింది. నేను అలాగే చేశాను. ఆయన దాన్ని బాగా పరిశీలించి, శస్త్రచికిత్స చేయాలని చెప్పారు. ఆ రోజులలో శస్త్రచికిత్సకు అవసరమైన సదుపాయాలు బొంబాయి నగరంలో మాత్రమే లభించేవి. మా ఆర్థిక పరిస్థితుల వలన నా తల్లిదండ్రులు నన్ను బొంబాయి తీసుకువెళ్ళే

పరిస్థితుల్లో లేరు. కానీ నానాటికీ పెరుగుతున్న ఆ వ్రణమును చూచి వారెంతో ఆందోళన చెందారు. ఒక రోజున నా నాల్గవ యేట మసీదు నుంచి మా అమ్మ నన్ను రెండు దెబ్బలుకొట్టి ఇంటికి లాక్కుపోతున్నప్పుడు మమ్మల్ని వెనక్కి పిలిచి బాబా చెప్పిన మాటలు ఆమెకు గుర్తుకొచ్చాయి. "ఈ నీ కొడుకు ఎవరో కాదు. గతించిన నీ తండ్రే మరల నీ కొడుకుగా జన్మించాడు. గత జన్మల నుండి అతడు నాకెంతో ఆత్మీయుడు. కనుక అతడిని నువ్వు కొట్టకూడదు" అన్నవే ఆనాటి మాటలు. ఆ సంగతి గుర్తుకు రాగానే మా అమ్మ ఆ విషయం నాతోను, వాళ్ళ అమ్మతో చెప్పి, మా నాన్నకు కూడా ముఖం మీద కుడి వైపున అటువంటి కణితి వుండేదని చెప్పింది.

ఆ రోజు గురువారం సాయంత్రం మా ఇంటిలో ఉన్న సాయిబాబా పటం ముందు ఉన్న ప్రమిదను మా నాన్న వెలిగించి బాబాను స్మరించి నా నొసట విభూతి పెట్టి పటంలోని బాబా కేసి చూస్తూ "బాబా! ఈ రోజు నుండి ఈ పిల్లవాడి పేరు మార్చి, వాళ్ళ తాత పేరు 'అప్పా' అని పిలుచుకుంటాము. అదే కదా మీఆజ్ఞ" అన్నాడు. ఆనాడు మసీదులో ఉన్న భక్తులందరికీ మా తల్లిదండ్రులు కలకండ పంచారు. చిత్రం! నాటినుండి మూడు రోజులలోగా ఏ మందూ వాడకుండానే నా ముక్కు మీది కణితి అణిగి పోయింది. ఇక మరల దాని జాడ కూడా కనిపించలేదు.

సాయి ఎన్నడూ రంగు దుస్తులు ధరించలేదు. చివరికి కాషాయం కూడా ధరించలేదు. అందుకే అటువంటి వస్త్రాలు ధరించి యున్నట్లు చిత్రించే యీనాటి పటాలను చూసినప్పుడు నాకు ఎంతో అసంతృప్తిగా వుంటుంది.

ఈనాడు తిరిగి వెనుకటి రోజులు గుర్తు తెచ్చుకుంటే సాయి సన్నిధి వలన నేను గ్రహించిన కొన్ని సత్యాలు మనస్సులో మెదులుతాయి.

మహాత్ముల సన్నిధిలో వున్నప్పుడు మన శరీరము, మనస్సు కూడా మన ప్రయత్నమే లేకుండా పవిత్రమై సుశిక్షితులమవుతాము. అంతేకాదు జీవిత మధ్య కాలంలో సాయి వంటి మహాత్ముల సాన్నిధ్యము దొరికినప్పుడు కూడా మన మనస్సు పవిత్రమై అప్పటి నుండి అప్రయత్నంగానే మన తలంపులు క్రియలు పవిత్రమవుతాయి. ఉత్తమ సంస్కారం దానికి అదే మనలో నెలకొంటుంది. శాంతి లేక అలమటించే వారికి అట్టి మహనీయుల సాన్నిధ్యంలో శాంతి లభిస్తుంది. అందుకే వారు ప్రత్యక్ష భగవత్స్వరూపులు.

అంతేకాదు సాయి వంటి మహనీయులలో మరొక చిత్రం వున్నది. వారి తత్వం మనకు అర్థమైన కొలది వారిని అర్థం చేసుకోవటం మరింత కష్టమైపోతుంది. ఒక గాజు పట్టకం లోనించి వెలువడే కాంతిని చూస్తున్నప్పుడు అందులో చిత్ర విచిత్రమైన రంగులు కనిపిస్తాయి. ఆ పట్టకాన్ని ఒక్కొక్క కోణంలోంచి చూసినప్పుడు ఒక కొత్త శోభ ఎప్పుడూ గోచరిస్తూనే వుంటుంది. మహాత్ముల తత్వం కూడా అట్టిదే. ఇంతకంటే కూడా మరొక సారూప్యమున్నది. వారి తత్వాన్ని అర్థం చేసుకోచూడటం ఆకాశాన్ని గమనించడంలాగా వుంటుంది. చూసినకొద్దీ మరి కొన్ని నక్షత్రాలు కొత్తవి కనిపిస్తుంటాయి. అంతేకాక అంతకు ముందు వచ్చిన గ్రహాలు, నక్షత్రాలు కొత్త శోభ నిత్యనూతనంగా కనిపిస్తుంది. వాటినెంత చూసినా యింకా తెలుసుకోవలసినదెంతో వుంటుంది. ఆకాశంలో గ్రహంగా ప్రకటమయ్యే గురువు (బృహస్పతి)ను గూర్చి సర్వము తెలుసుకోవచ్చునేమోగానీ, ఈ భూమి మీద మన మధ్యనే ప్రకటమయ్యే సద్గురువు గురించి పూర్తిగా తెలుసుకోవడం ఎన్నటికీ సాధ్యం కాదు. సకల మానవజాతి శ్రేయస్సు కోసం వారి జీవితమంతటిని అంకితం చేయటమొక్కటే వారి ప్రధాన లక్షణంగా మనం గుర్తించవచ్చు.

సాయి సన్నిధి తలచుకుంటే ఎంతో అద్భుతం గాను అపూర్వంగాను తోచే విషయమొకటి వున్నది. రోజులో ఎప్పుడైనా ఎవరైనా ఆయనను నిరభ్యంతరంగా దర్శించవచ్చు. ఆయన పాదాలను తాకవచ్చు. సన్నిధిలో ఎంతసేపైనా కూర్చోవచ్చు. ఆయన జీవితమంతా ఇలానే గడిచింది. అదే సాంప్రదాయం ఈనాటికీ కొనసాగడమే అన్నింటికంటే తృప్తికరమైన విషయము.

సాయి సన్నిధిలో నాకు తెలిసిన విషయమొకటి వున్నది. సాటి మానవులను సంతోషపెట్టడంలోనే తృప్తిని పొందటం మనం నేర్చుకోవాలి. అంటే మనకు కలిగిన దాన్ని అది లేని సాటి వారికి సమర్పించగలగాలి. కానీ ఈ సూత్రాన్ని ఆచరించడం అంత తేలికైనది కాదు. ఆచరణ అలవడాలంటే సాయిబాబాను చూడాలి. ఆయనను దర్శించండి.

*మిగతా 28వ పేజీలో*

# అన్నాసాహెబ్ దభోల్కర్

పూజ్య ఆచార్య శ్రీ ఎక్కిరాల భరద్వాజ

ఖండోబా దేవునికి అంకితమైన నర్తకీ నర్తకులు ఉల్లాసంగా నృత్యం చేస్తుంటే సామాన్యునిలా సాయి గూడా చూస్తుండేవారు. గాయకులు పాడుతుంటే ప్రీతిగా వినేవారు. కాని వారి హృదయంలోని సమాధిస్థితి వీటి వేటివలనా కొంచెమైనా చలించేదిగాదు. వారి హృదయం పై అల్లాహ్ నామము ముద్రించుకుపోయింది. వారి ఆశ్రమము, స్థితీ ఎట్టివో నిర్ణయించడం కష్టం. కాని ఒక్కటి నిశ్చయం: ఆయన వున్నచోటే వుంటున్నా, ఆయనకు సర్వమూ తెలుసు. సృష్టిలో జరిగేదంతా తెలుసు. ఆయన ప్రతిరోజూ దర్బారు నిర్వహించి జ్ఞానం ప్రసాదించే విషయాలు వేలకొద్దీ చెబుతున్నట్లు స్థూలదృష్టికి కన్పించేవారు. కాని అంతరంగంలో ఆయన మౌన నిష్ఠలో వుండేవారు. ఆయనొక గోడనానుకుని నిలుచునేవారు. ఉదయము, (ఆయన స్థూలదృష్టికి) సాయంత్రము బయటకు వెళ్ళి వచ్చేవారు. కాని నిజానికి ఆయన ఎల్లప్పుడూ ఆత్మయందే నిమగ్నులై యుండేవారు. ఆయన ఆజన్మ సిద్ధుడైనప్పటికీ సాధువువలె నడుచుకొంటారు. నమ్రత, నిరహంకారాలతో ఆయన సర్వులకూ సంతోషమీయడానికే యత్నిస్తుండేవారు.

బాబా మహాసమాధి చెందాక 1920 ప్రాంతంలో యితడు గూడ సాయి సంస్థానం నిర్వహణలో ఎంతో సేవ చేశాడు. దీక్షిత్ మరణించాక 'సాయిలీల' పత్రికకు సంపాదకుడుగా గూడ పనిచేశాడు. ఇతడు 1929లో మరణించాక ఇతడు వ్రాసిన గ్రంథానికి అధ్యాయం 53 వ్రాయించి జతపరచి 'శ్రీ సాయి సత్ చరిత్ర' ను ఒక గ్రంథంగా ముద్రించారు శ్రీసాయి సంస్థానంవారు.

## ఆచార్య సందేశం

సాయి మనకు ప్రసాదించాలని ఆరాటపడిన ఉన్నతిని మరింత త్వరగా భక్తులు పొంది ఆయనను, తమనూ సంతుష్టి పరచగలగాలని నా ఆశ! అట్టి మహనీయమూర్తిని సంతుష్టి పరచడంకన్నా మనం చేయదగినదేమున్నది? ఆయన సంతుష్టులైతే సకల సృష్టి సంతుష్టమైనట్లే. సకల జీవులకూ శ్రేయస్కరమైన రీతిన మన జీవితాలను సంస్కరించుకోవడమే కదా సాయి బోధించిన మార్గము. అలా ఆచరించడం ఆయనను సంతృప్తి పరచగల మార్గము.

*సకల విశ్వరూపుడైన సాయియే సత్యము!*
*సకల జన శ్రేయస్కరమైన సాయి బోధయే మార్గము!*
*సాయి లక్ష్యంగా, వారి బోధనను మార్గంగా స్వీకరించిన వారిచేత సాధింపబడే పరమ శ్రేయస్సే శాశ్వత జీవనము!!*

**పూజ్య ఆచార్య శ్రీ ఎక్కిరాల భరద్వాజ**

# ద్వారకామాయి అనుభవమండపము

## ఆయన ఖచ్చితంగా బాబాయే!

నాకు ఆ మహాత్ముడు సాయి ఇచ్చిన అనుభవాల వలననే ఆయన పాదముల చెంతకు చేరాను. విద్యానగర్ లో చదువుకునే రోజులలో శ్రీ భరద్వాజగారిని ఒక లెక్చరర్ గానే గుర్తించాను. ఆ రోజులలో వాళ్లంతా కలిసి ఒక పూరిపాకలో భజన చేసుకుంటుంటే, ఎగతాళి చేసిన వాళ్ళలో నేనూ ఒకడిని. నా కాలేజీ లైఫ్ అంతా కొంటెతనముగానే గడిచిపోయింది. ఆ తరువాత ఒక అమ్మాయితో నా మ్యారేజి సెటిల్ చేసినారు ఆమె ఇప్పుడు నా భార్య జయ. ఆమె అప్పుడు కాలేజీలో చదువుకుంటూవుంది. చదువు పూర్తికానిదే మ్యారేజి చేసుకోవడం ఆమెకు ఇష్టం లేదు. నాకు ఉద్యోగం రానిదే చేసుకోవడం ఇష్టం లేదు. ఒకసారి పక్కవాళ్ళతో కలసి బాబాగుడికి తను వెళుతూ, నన్నుకూడా రమ్మని ఈ అమ్మాయి పిలిచింది. అట్లా ప్రారంభమైంది నేను బాబాగుడికి పోవటం. 2-3-1977వ తేదీన మొదటి అనుభవం వరకు బాబా ఒక దేవుడని గాని, మహాత్ముడని గాని గుర్తించి నేను గుడికి పోవడం జరగలేదు. పూజారులు యిచ్చిన విభూతి ముఖానికి పూసుకుని, తీర్థం గొంతులో పోసుకుని ఎప్పుడెప్పుడు బయటపడదామా అనుకుంటూ వుండేవాడిని. అవి రెండు దేవుడి ప్రసాదం అని నాకు తెలిసిచస్తేగా. ఈవిడేమో (జయ) అవి రెండూ పుచ్చుకొనిదే బయటకు రానిచ్చేదికాదు. ఒక విధంగా చెప్పాలంటే ఈవిడే నాకు మార్గదర్శి అయ్యింది.

నాకు బాబా ఇచ్చిన మొదటి ఎక్స్పీరియన్స్ ఏమిటంటే మార్చి 3, 1977 న నాకు మ్యారేజ్ ఫిక్స్ చేశారు. చేతిలో డబ్బు లేదు. ఇంట్లో వడ్లు వున్నాయి కానీ కొనే నాథుడు లేడు. మా తండ్రిగారు, మా మామగారు ఎక్కడా డబ్బు దొరకక తిరిగి వచ్చేశారు. గుడ్డలు, బంగారము యింకా యితర సామాన్లు అన్నీ అప్పు తెచ్చాము. కానీ కనీసం రూ.1500/- అయినా చేతిలో లేనిదే ముహూర్తం గడవదు. ముహూర్తం దగ్గర పడుతోంది. అప్పుడు గుర్తుకు వచ్చాడు ఈ మహాత్ముడు 'సాయిబాబా'. ఈయన "నిజంగానే దేవుడే అయితే నాకు ఈ రోజు రూ.1500/- దొరకాలి" అనుకుంటూ ఒక మార్వాడి వద్దకు బయలుదేరాను. ఆ మార్వాడి దగ్గర మా ఊర్లో వుండే ఒక రెడ్డిగారు నా ద్వారా బంగారం కుదువ పెట్టించి కొంత డబ్బు తీసుకొన్నాడు. తర్వాత ఆ రెడ్డి గారికి మరల డబ్బు అవసరమై, అదే బంగారము పైన ఇంకా కొంత తెమ్మని నన్ను పంపగా అది గుర్తించిన ఆ సేఠ్ నా దగ్గర యిప్పుడు డబ్బు లేదని ఖచ్చితంగా చెప్పేశాడు. ఆ మరురోజు "నా పెళ్లి ముహూర్తం దగ్గరపడుతోంది నాకు అర్జెంటుగా రూ.1500/- కావాలి" అని అడిగినప్పుడు, అతడే రూ.1000/- మాత్రమే వుందని, నా దగ్గర్నుంచి ఎలాంటి రసీదు తీసుకోకుండా యిచ్చేశాడు. ఆ వెయ్యి రూపాయలు తీసుకుని వస్తుంటే మా ఊరి పంచాయతీ గుమాస్తా కనిపించి నా చేతికి రూ.500/- చెక్కు యిచ్చి "నేను అర్జంటుగా ఊరికి వెళుతున్నాను. బ్యాంకులో మార్చి నాకు డబ్బులు పంపు" అని చెప్పి వెళ్ళిపోయాడు. నేను వెంటనే బ్యాంకులో మార్చుకొని మొత్తం 1500 రూపాయలు జమ చేసుకొని నా పెళ్లి కార్యక్రమం పూర్తి చేసుకున్నాను (వివాహానంతరం సకాలములో ఎవరి డబ్బు వారికి తిరిగి అందజేశాను). ఇదంతా బాబా మహిమ అని ఆరోజు గ్రహించాను.

నాకు ఉద్యోగరీత్యా నెల్లూరు నుంచి రేణిగుంటకు బదిలీ చేయటం జరిగింది. కానీ నా ఫ్యామిలీ నెల్లూరులోనే వుండటం వలన తరచుగా నెల్లూరు వస్తూండే వాడిని. ఒకరోజు నా స్నేహితునితో కలిసి రేణిగుంట నుండి నెల్లూరు వస్తుంటే, మధ్యాహ్నం భోజనం కొరకు వెంకటగిరిలో బస్సు ఆగింది.

***మిగతా 27వ పేజీలో***

# ఆచార్యుని అద్భుత లీలలు



మేము గుంటూరులో వుండేవాళ్ళం. అక్కడ మాస్టర్ గారి సత్సంగ సభ్యులతో పరిచయం ఏర్పడి, సత్సంగాలకు వెళ్ళేదాన్ని. అంతకుముందే మేము ఇబ్రహీంపట్నంలో వుండేటప్పుడు ఒకరి ద్వారా శ్రీ సాయి లీలామృతము, శ్రీ గురు చరిత్ర గ్రంథాలు తీసుకొని పారాయణ చేసేదాన్ని. మధ్య మధ్యలో ఒంగోలు వెళ్లి శ్రీ మాస్టర్ గారి సమాధి మందిరాన్ని దర్శించుకునే వాళ్ళము. మాకు ఒక అమ్మాయి, ఒక అబ్బాయి. మా అమ్మాయి ఇంటర్ ఫస్ట్ ఇయర్ ఎగ్జామ్స్ అయ్యాక ఒకసారి ఒంగోలు వెళ్ళాము. సమాధి మందిరం దగ్గర ఒక ఆయన (white dress వేసుకొని వున్నారు) వచ్చి మా పాపను పలకరించి, "ఏం చదువుతున్నావు?" అని అడిగారు. "ఇంటర్ ఫస్ట్ ఇయర్ అయింది" అని చెప్పింది. "బాగా కష్టపడి చదివితే B.Tech చేయగలవు" అన్నారు. తర్వాత మావారి గురించి అడిగారు. మా పాప సెకండియర్ లో ఉండగా మావారు పోయారు. ఒంగోలు సమాధి మందిరంలో ఒక ఆయన బాగా కష్టపడి చదవాలి (ఆ వ్యక్తి మాస్టరుగారు అని మా నమ్మకం) అన్నారుకదా. దానికి బాగా గుర్తుండి అలానే కష్టపడి చదివేది. పారాయణ చేసేది. ఒకసారి మేము తిరుపతి వెళ్ళాము. పారాయణ గ్రంథం ఇంట్లోనే మరిచిపోయింది. 'అయ్యో ఇప్పుడు ఎలా పారాయణ చేసుకోవాలి?' అని చాలా బాధపడుతోంది. విచిత్రంగా అలివేలుమంగాపురం లో 'శ్రీ సాయి లీలామృతము' అమ్ముతున్నారు. తను అది కొనుక్కొని పారాయణ పూర్తి చేసుకుంది. అలా శ్రీ మాస్టర్ గారు పారాయణ కొరత పడకుండా కాపాడారు. మావారు లేని మా సంసారంలో ఎన్నో ఒడిదుడుకులు.... అన్నింటికీ మాస్టరుగారి మీద భారంవేసి పారాయణ చేసుకుంటూ వుంటాను. ఇప్పటి వరకు చల్లగా కాపాడారు.

మా అమ్మాయి B.Tech పూర్తి చేసింది. అప్పుడు ఉద్యోగ ప్రయత్నాలు చేస్తూ, కొంచెం ఖాళీ దొరికితే ఒక వారంలో శ్రీ సాయి లీలామృతము, శ్రీ గురు చరిత్ర గ్రంథాలు పారాయణ పూర్తి చేసుకున్నది. అది పూర్తవగానే శ్రీ మాస్టరుగారు కలలో కనిపించారు ఎలాగంటే శ్రీ మాస్టరుగారి ఫోటోలో లాగా. ముఖం మాత్రం వాళ్ల నాన్నగారిదట. ఆ పటాన్ని పట్టుకొని డాడీ, డాడీ అని బాగా ఏడ్చిందట. అప్పుడు పటము నుంచి "నేను నాన్నను కాను, కానీ నాన్నలాంటి వాడిని" అని చెప్పారట. వెంటనే మా పాప వారి పాదాలు పట్టుకుని నమస్కారం చేసుకుందట. తర్వాత కొద్ది రోజులకే తనకి T.C.S. లో జాబ్ వచ్చింది. మేము గచ్చిబౌలికి వచ్చేసాము. పారాయణలు చేసుకుంటూ, నాంపల్లి బాబా గుడిలో గురుకుటుంబం చేసే సత్సంగాలకు హాజరవుతూ వుంటాము.

*-శ్రీమతి లలిత,*
*గచ్చిబౌలి, హైదరాబాదు.*

నా పేరు దేవి. మాది ఒంగోలు. 2017 వ సంవత్సరంలో నేను ఒక మండలంపాటు, అంటే 40 రోజులు శివాలయానికి క్రమం తప్పకుండా వెళ్లాలని సంకల్పించాను. అదేవిధంగా వెళ్ళసాగాను. మండలం పూర్తయిన తర్వాత కూడా రెండో మండలం చేద్దామని ఆ విధంగా 72 రోజులు వెళ్లాను. ఇంకా 8 రోజులు వెళితే రెండో మండలం కూడా పూర్తి అవుతుంది. కానీ అకస్మాత్తుగా బాబా గుడికి బాబా గుడిలో వున్న మాస్టరుగారి మందిరం దగ్గర కూడా ఇలా మండలం పాటు వెళ్లాలని ప్రేరణ కలిగింది. మా ఇంట్లో అందరూ "ఆ ఎనిమిది రోజులు కూడా వెళితే రెండు మండలాలు పూర్తి అవుతాయి. తర్వాత బాబా గుడికి, మాస్టరుగారి దగ్గరకు వెళ్ళవచ్చు. రెండింటికీ వెళ్లాలంటే వీలుకాదు కదా!" అన్నారు. కానీ నాకు వెంటనే మాస్టరుగారి దగ్గరకు వెళ్లాలని

అనిపించింది. శివాలయానికి వెళ్ళటం ఆపేసి బాబా గుడిలో వున్న మాస్టరుగారి సమాధి మందిరం దగ్గరకు వెళ్ళి కూర్చుని పారాయణ చేయడం ప్రారంభించాను. కానీ మనసులో కొంచెం ఏదోలాగా అనిపించింది. ఆ ఎనిమిది రోజులు కూడా శివాలయానికి వెళ్లి రెండు మండలాలు పూర్తి చేసి యిక్కడకు వచ్చివుంటే బాగుండేదేమో అనిపించింది. అయితే నా మనసులో వున్న కొరతని శ్రీ మాస్టరుగారు ఎలా తీసివేశారో చూడండి!

మాస్టరుగారి దగ్గరకు వెళ్ళిన రెండో రోజు రాత్రి ఒక స్వప్నం వచ్చింది. అది మామూలు స్వప్నమా? కాదు! అది ఒక దివ్యస్వప్నం! నమ్మ శక్యం కాని అటువంటి ఒక నగ్న సత్యం! స్వప్నంలో మాస్టరుగారి విశ్వరూపాన్ని నేను దర్శించాను. అపూర్వము! అనిర్వచనీయం! మాస్టరుగారి సమాధి ఎత్తుతో సమానముగా, వారి సమాధి చుట్టూ 'శివలింగాలు' వున్నాయి. శివునికి తనకు భేదము లేదని మాస్టరుగారు నాకు ఈ విధంగా దివ్యస్వప్నం ద్వారా తెలియజేశారు. ఎంత భాగ్యం కలిగింది నాకు! మాస్టరుగారి రూపాన్ని దర్శించగలిగాను! "ఓం విశ్వరూప సాక్షాత్కార ప్రదానాయ నమః" అని మాస్టరుగారి అష్టోత్తరంలో కీర్తించారు. ఆ నామం ఎంత నిజమో నాకు అనుభవమయింది అని నేను చెప్పలేని ఆనందముతో పులకించిపోయాను. ఆ స్వప్నం నాకు చిరస్మరణీయం. నాకు ఒక దివ్యానుభూతినిచ్చిన ఆ స్వప్నం నా మదిలో నిలిచిపోయి, నిరంతరం దివ్యపరిమళాలను వెదజల్లుతూనే వుంది.

ఇప్పుడు నాకు అనిపిస్తూంది, మనం ఎంతటి అదృష్టవంతులం అని! సాక్షాత్తు ఆ ఈశ్వరుడే మానవాకృతి దాల్చి ఈ భూమి మీద నడవడానికి దిగివచ్చి మన మధ్యనే మాస్టరుగారి లాగా సంచరించారు అని. మనం ఆ దైవంతో కలిసి జీవించాము. ఆయనతో మాట్లాడాము! పాద నమస్కారాలతో ఆ దైవాన్ని తాకాము! ఆ దైవంతో కలసి నడిచాము. ఇది నిత్య సత్యం. ఇప్పటికి ఆ దైవం యొక్క సమాధిని తాకుతున్నాము. ఏమిటి యింత కరుణ ఆయనకు మన మీద. మనం ఎంతటి భాగ్యవంతులం. ముందు తరాల వారికి సమాధిని తాకే అదృష్టం ఉండదని నా ఉద్దేశ్యం. దైవంతో సహజీవనం చేశాము అని నాకు ఎంతో అబ్బురంగా వుంది. నాకు ఇంతటి దివ్య దర్శనం యిచ్చి నన్ను ధన్యురాలిని చేసిన కలియుగ దైవము మన ప్రియతమ మాస్టరుగారికి కృతజ్ఞతలు. వారి దివ్య చరణాలకు అనేకానేక ప్రణామములు.

ఈ మహత్తరమైన అనుభవాన్ని మీతో పంచుకుంటుంటే నా మనసు పరవశమై పోతోంది. ఇంకా ఇంకా దివ్య అనుభూతుల్ని తెలియజేయాలనివుంది. అయితే మదిలోని భావనల అన్ని భాషలోకి తీసుకురాలేను. మాస్టరుగారు మాటలకు అందరు. మన మనసుకే అందుతారు. అది ఎవరికి వారే సాధన చేసి ఆయనను మనసులో నింపుకోవాలి. మన మనః ప్రవృత్తిని శుద్ధ పరుచుకొని వారి యొక్క ఆశయాలను నెరవేర్చడానికి ప్రయత్నం చేయాలి అప్పుడే ఆయన ఆనందిస్తారు మనలను అనుగ్రహిస్తారు.

*-శ్రీమతి దేవి,*
*ఒంగోలు.*

## ద్వారకామాయి అనుభవ మండపము

25వ పేజీ తరువాయి

నా స్నేహితుడు రేణిగుంటలోనే భోజనం చేయటం వలన నేను ఒక్కడినే అక్కడ ఉన్న మురళీకృష్ణ హోటల్ లో భోజనం చేసి, హోటల్ ముందు ఉన్న కిళ్ళీషాపు దగ్గరకు వచ్చేసరికి కిళ్ళీ కట్టించి నాకు ఇవ్వడానికి నా ఫ్రెండు ఎదురు చూస్తున్నాడు. నేను అందుకోబోయేలోగా ఒక విచిత్రమైన వ్యక్తి నా దగ్గరకు వచ్చి ఏదో చెప్పబోయాడు. ఆయన చాలా వికారముగా ఒళ్లంతా మాసిపోయిన దుస్తులు ధరించి, జోలి కట్టుకొని చాలా భయంకరంగా కనిపిస్తున్నాడు. ఆయన వచ్చి నన్ను తాకుతాడు అని భయపడి పారిపోయి బస్సు ఎక్కేసాను. ఆయన నా వెంట బస్సు గేటు దగ్గర వరకు వచ్చి ఆగిపోయాడు. నాకు ఎందుకో అనుమానంవచ్చి ఆ వ్యక్తి ఎవరో తెలుసుకోవాలని, వెంటనే బస్సు దిగి చూస్తే ఆయన ఎక్కడా కనిపించలేదు. చాలాసేపు ఆ ప్రదేశం అంతా వెతికాను. ఆయన కనిపించనేలేదు. ఈయన మానవమాత్రుడు కాదు సాక్షాత్తు శ్రీ సాయిబాబా అని గ్రహించాను. ఇంకో నిదర్శనం ఏమిటంటే ఆయన ఆకారము చూస్తూంటే మానవజన్మ ఎత్తినవాడు ఎవడూ అలాంటి జీవితం గడపలేడు. అందుకే ఆయన బాబా అని నేను ఖచ్చితంగా చెప్పగలను.

*- శ్రీ జయచంద్రారెడ్డి*

## సాయి పట్ల భక్తి విశ్వాసాలే భక్తుని సిరిసంపదలు

01వ పేజీ తరువాయి

సంతోషంగా దానిని తీసుకొని, కొద్ది క్షణాలు తమ చేతిని అతని శిరస్సుమీద వుంచి ఆశీర్వదించి, విభూతి పెట్టి "నువ్వు నాకు సంతోషంగా దక్షిణ యిచ్చావు. నారాయణుడు నీకు సర్వమూ పుష్కలంగా ప్రసాదిస్తాడు" అన్నారు. అతడు ఎంతో భారము తీరిన వాడిలాగా, ధన్యుడయినట్లు సంతోషంగా శిరిడీ విడిచి వెళ్ళాడు.

సాయిమాట ఎన్నడైనా అబద్ధమైతేగదా! ఎనలేని సిరిసంపదలు బోడస్ కు అనతికాలంలోనే సంక్రమించాయి. అంతేకాదు, అంతకుమించిన లక్ష్మి అతడిని వరించింది. అదే అచంచలమైన గురుభక్తి!! సాయిని దర్శించాక వేరొక మహాత్ముడిని దర్శించనని అతడు నిర్ణయించుకున్నాడు. అందరు మహాత్ముల రూపమే ఆయన అని అతని హృదయం గ్రహించింది! తన సమకాలీనుడైన ఆ ఫకీరును అంతలా విశ్వసించగల్గడం కంటే వేరే సిరిసంపదలు ఏముంటాయి!! ●

## మాస్టర్ E.B.

16వ పేజీ తరువాయి

ఆలోచించండి. ఈ మహనీయ మూర్తి ప్రవచించే సాయి తత్వాన్ని మానవ సంఘంలో వ్యాపింపజేసి ఆ ధర్మాన్ని సజీవంగా ఉండేటట్లు మనం రక్షించగలిగినప్పుడే ఆ ధర్మము కూడా ఈ మానవ సమాజాన్ని కాపాడుతుంది. అదే 'ధర్మో రక్షతి రక్షితః'.

మాస్టరు గారి జీవితం ఈ లక్ష్య సాధనకు అంకితమై వున్నది. ఇక అంకితం కావలసినది మనమే. ఈ లక్ష్య సాధనలో మాస్టరు గారిని, వారి ప్రచార కార్యక్రమాలలో బలపరచవలసిన బాధ్యత మనపై వున్నది.

మాస్టరు గారి జన్మదినం అక్టోబర్ 30వ తేదీ. ఆ రోజు నుండి ఈ ప్రచార కార్యక్రమాన్ని ప్రపంచవ్యాప్తం చేయటానికి అందరూ నాంది పలకాలని ఆశిస్తున్నాను.●

## సాయి సమాధి అయిన రోజు నాకు యిప్పటికీ గుర్తే!

23వ పేజీ తరువాయి

ఆయన కళ్లలోకి చూడండి. ఆయన హృదయాన్నర్థం చేసుకోండి. అప్పుడు మీ హృదయాలలో భక్తి అంకురిస్తుంది. అహంకారాది దుర్గుణాలను విడిచి ఆ స్ఫూర్తితో మీ మనోవాక్కాయకర్మలను పవిత్రం కానివ్వండి. అప్పుడు మీకు మనశ్శాంతి తప్పక లభిస్తుంది. ప్రపంచం నాలుగు మూలల నుండి ఆయన దర్శనం కోసం అన్ని మతాల వారు వస్తారు. తమ తమ మత ప్రవక్తలను వారిలో దర్శిస్తున్నారు. ఆయనలో వారందరూ మూర్తిభవించిన పవిత్రత, నిస్వార్థత, దయ, వివేకాలనే చూస్తారు. మానవ కల్పితమైన సర్వ భేదాలకు అతీతంగా వుండి, సర్వ మానవులకు శాంతి సుఖాలను ప్రసాదించే దివ్యత్వాన్ని వారిలో దర్శిస్తున్నారు. సాయి పాటలు గాని, పద్యాలు కాని, గ్రంథాలుగాని రాయలేదు. ఉపన్యసించలేదు. తనను గూర్చి ఎట్టి స్మృతి చిహ్నాన్ని చిరస్మరణీయం చేసుకోజూడలేదు. ఆయన గూర్చి తెలపటానికి వారి జీవిత చర్యలే చాలు. ఆయన నిత్య జీవితాన్ని ఆయన చేసిన పనులను సూక్ష్మంగా గమనించి మననం చేసుకుంటే మన హృదయంపై వాటికి ఎంతో బలమైన ప్రభావం ఉంటుంది. ఉదాహరణకు ఆయన తమ చెంత ఎట్టి వస్తు సామాగ్రిని నిలువ చేసుకోలేదు. ఆయన వద్ద నీరు త్రాగటానికి ఒక డబ్బా, ఒకచిలిం గొట్టం, కఫ్నీ ఒక గుడ్డ పీలిక తప్ప మరేమీ వుండేది కాదు. భక్తులు మసీదుకు తీసుకువచ్చి సమర్పించిన రుచికరమైన నివేదనలను కూడా ఆయన ఎన్నడూ తినేవారు కాదు. మధ్యాహ్న హారతి కాగానే ప్రతిరోజు భక్తులు సమర్పించిన భోజనపు పళ్ళాలలోని పదార్థం అంతటినీ అక్కడ చేరిన భక్తులు అందరికీ పంచేసే వారు. వారంతా మసీదు విడిచి వెళ్ళాక గ్రామంలోని కొద్ది ఇళ్లలోంచి ఆయన తెచ్చుకున్న కొద్ది భిక్షను మాత్రమే స్వీకరించేవారు. ఆ భిక్షలో కూడా రుచికరమైన వంటకాలను స్వీకరించేవారు కాదు. ఒకటి రెండు రొట్టెలు, ఒక ఉల్లిపాయ, కొద్దిఉప్పు, పచ్చడి మాత్రమే తీసుకునేవారు. అలాగే ఆయనకు సమర్పించబడిన కానుకలనన్నింటినీ పేదసాదలకు పంచేసేవారు. అందుకే కాబోలు 'త్యాగం వల్ల మాత్రమే అమృతత్వం సిద్ధిస్తుంది' అని శ్రుతులు అన్నీ ఘోషిస్తున్నాయి. ఇందరు ప్రజలు శిరిడీని దర్శించి ఆయనకు పాదాక్రాంతులై శాంతిని పొందుతున్నారంటే అదే కారణం!●

జై సాయి మాస్టర్!

# శ్రీ 'సాయిబాబా' పాఠకులకు విజ్ఞప్తి

పూజ్యశ్రీ మాస్టరుగారి దివ్య బోధనలను, వివిధ మహాత్ముల గూర్చిన విషయ విశేషములు, ఇంకా ఇతరములైన ఎన్నో ఆధ్యాత్మిక, విజ్ఞాన విషయాలను పఠించడం ద్వారా పూజ్యశ్రీ మాస్టర్‌గారి సాన్నిధ్యాన్ని అనుభవిస్తూ, ఆనందిస్తున్న 'సాయిబాబా' మాసపత్రిక పాఠకులకు కృతజ్ఞతాపూర్వక నమస్కారములు.

పూజ్యశ్రీ భరద్వాజ మాస్టర్‌గారి 80వ జన్మదిన సందర్భంగా శ్రీ మాస్టరుగారితో భక్తులకు గల అనుభవాలను అక్టోబరు 2017 సంచిక నుండీ ధారావాహికంగా ప్రచురిస్తున్నాము. కనుక పాఠకులు పూజ్యశ్రీ మాస్టరుగారితో తమకుగల అనుభవాలను పత్రికకు పంపవలసినదిగా ప్రార్థన.

అదే విధంగా శ్రీ సాయినాథునితో తమకుగల అనుభవాలను గూడా పంపవలసినదిగా ప్రార్థన.

పూజ్యశ్రీ మాస్టరుగారితో గల అనుభవాలను 'ఆచార్యుని అద్భుతలీలలు' అను శీర్షికకు, శ్రీ సాయినాథునితో గల అనుభవాలను 'ద్వారకామాయి అనుభవమండపము' అను శీర్షికకు పంపగలరని మనవి.

ఇట్లు
ఎడిటర్.

**SRI GURUPADUKA PUBLICATIONS,**
**C/O SRI MANGA BHARADWAJA TRUST,**
Regd. Office: Bhakta Nivas, 12-1-170/46P, Hanuman Nagar, Jaipuri Colony, Nagole, Hyderabad - 68
Phone : +91 - 74160 41550

# పరమ పూజ్య ఆచార్య శ్రీ ఎక్కిరాల భరద్వాజ మాస్టరుగారిచే రచించబడిన అపూర్వ ఆధ్యాత్మిక వైజ్ఞానిక గ్రంథములు

| | |
|---|---|
| శ్రీ సాయి లీలామృతం-శ్రీ గురు చరిత్ర | 450-00 |
| శ్రీ సాయిబాబా జీవిత చరిత్ర | 90-00 |
| శ్రీ సాయి లీలామృతము | 99-00 |
| శ్రీ గురు చరిత్ర | 99-00 |
| శ్రీ సాయి సన్నిధి | 120-00 |
| శ్రీ సాయి మాస్టర్ ప్రవచనములు | 125-00 |
| శ్రీ సాయినాథ ప్రబోధామృతము | 80-00 |
| సాయినాథ పూజ | 40-00 |
| సాయినాథ స్థవనమంజరి | 10-00 |
| శిరిడి ఆరతులు | 15-00 |
| సాయిబాబాను సేవించడమెందుకు | 10-00 |
| సత్సంగము-భజన | 5-00 |
| శిరిడి క్షేత్ర సందర్శనము | 40-00 |
| విజ్ఞాన వీచికలు | 99-00 |
| పరిప్రశ్న | 99-00 |
| మతమెందుకు? | 50-00 |
| ఏది నిజం? | 50-00 |
| ధ్యానయోగ సర్వస్వం | 99-00 |
| బుద్ధధ్యాన హృదయం | 49-00 |
| దత్తావతార మహత్యం | 75-00 |
| సంహితాయన గురు ద్విసాహస్రి | 128-00 |
| పురుషసూక్త రహస్యం | 40-00 |
| సాయిసూక్తి-ఆచార్యవాణి | 10-00 |
| శ్రీ పాకలపాటి గురువుగారు | 49-00 |
| అవధూత శ్రీ చీరాల స్వామి | 49-00 |
| అవధూత శ్రీ వెంకయ్యస్వామి | 70-00 |
| శ్రీ ఆనందమాయి అమ్మ | 49-00 |
| టిబెట్ యోగి మిలారేపా చరిత్ర | 80-00 |
| శ్రీ హజరత్ తాజుద్దీన్ బాబా చరిత్ర | 49-00 |
| స్వామి సమర్థ(అక్కల్కోట స్వామి) | 49-00 |
| మనము-మన సంస్కృతి | 70-00 |

### ఇతర ప్రచురణలు

| | |
|---|---|
| మహాత్ముల ముద్దుబిడ్డడు | 120-00 |
| అవధూత చివటం అమ్మ | 70-00 |
| శ్రీ సిద్ధారూఢ స్వామి చరిత్ర | 70-00 |
| శ్రీ సాయి మాస్టర్ స్మృతులు | 125-00 |
| మరో నందదీపం | 80-00 |
| ఆచార్య అమృత లేఖావళి | 40-00 |
| భగవాన్ శ్రీ భరద్వాజ | 175-00 |
| బాలల శ్రీ సాయి లీలామృతము | 25-00 |
| మహాపురుషుడు | 50-00 |
| శ్రీ సాయి మాస్టర్ స్మృతులు (2) | 125-00 |
| బాలల శ్రీ సాయి సన్నిధి | 50-00 |

### BOOKS IN ENGLISH

| | |
|---|---|
| Sai Baba the Master | 175-00 |
| Sree Guru Charitra | 99-00 |
| Supreme Master(Swami Samartha) | 99-00 |
| Sai Baba of Shiridi and His Teachings | 99-00 |
| Life and Teachings of Hazarat Tajuddin Baba | 99-00 |
| Children's SaiBaba the Master | 60-00 |

### BOOKS IN OTHER LANGUAGES

| | |
|---|---|
| Sadguru Sai Baba(Hindi) | 150-00 |
| Sai Leelamrutham(Kannada) | 150-00 |
| Sai Baba Jeevitha Charitham(Malayalam) | 220-00 |
| Sai Baba Leelamrutham(Tamil) | 175-00 |
| Sri Guru Charitra (Hindi) | 99-00 |
| Swami Samartha (Kannada) | 99-00 |
| Sri Guru Charitra(Kannada) | 45-00 |
| Shiridi Aarathi(Tamil) | 15-00 |
| Stavana Manjari(Tamil) | 10-00 |
| Tibet Yogi Milarepa Jeevitha Charitra(kannada) | 55-00 |
| Sri Sainath Prabodhamruthamu (Kannada) | 65-00 |

**SRI GURUPADUKA PUBLICATIONS, C/O SRI MANGA BHARADWAJA TRUST,**
Regd. Office: Bhakta Nivas, 12-1-170/46P, Hanuman Nagar, Jaipuri Colony, Nagole, Hyderabad - 68
Phone : +91 - 74160 41550
Branch Office: Kondaiah Bunk Street, Kothapet, Ongole, Prakasam Dt., Andhra Pradesh.
Phone: 08592 233271
**Send DD in favour of "Sri Manga Bharadwaja Trust(Publications)", payable at Hyderabad or Ongole.**